RNI No. APTEL/2008/23088

తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA
TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :BOORLA VENKATESHAM KARIMNAGAR VOLUME:18 ISSUE:160 SATURDAY,NOVEMBER 21,2026 PAGES:12 COST: 2 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :18 సంచిక :160 శనివారం, నవంబర్ 21, 2026, పేజీలు -12 వెల :2/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

పట్టభద్రుల పీఠమే టార్గెట్.. కేటీఆర్ 'మాస్టర్ ప్లాన్'.!

ఓటర్ల నమోదు నుంచి సోషల్ మీడియా వరకు పక్కాగా స్కెచ్.. బీఆర్ఎస్ శ్రేణులకు దిశానిర్దేశం



తెలంగాణ పత్రిక ప్రతినిధి:

తెలంగాణ రాజకీయాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. సాధారణ ఎన్నికలకు భిన్నంగా విద్యావంతులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత ఓటర్లుగా ఉండే ఈ ఎన్నికల్లో విజయం సాధించడం ప్రధాన పార్టీలకు కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో గత ఎన్నికల అనుభవాల ను దృష్టిలో ఉంచుకుని, బీఆర్ఎస్ పార్టీని విజయప థంలో నిలిపేందుకు కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియ నుంచి క్షేత్రస్థాయి ప్రచారం వరకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు.

ఓటరు నమోదు పైనే తొలి దృష్టి

పట్టభద్రుల ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు కంటే ముందు ఓటర్ల నమోదు అత్యంత కీలకం. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించడమే సగం విజయం సాధించినట్లేనని కేటీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సాంకేతిక నిపుణులు, కార్పొరేట్ ఉద్యోగులు, నిరు ద్యోగ యువత, గ్రాడ్యుయేట్లను పెద్ద సంఖ్యలో గుర్తించి ఓటర్లుగా చేర్పించ డానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని ప్రతి మండలం, పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు, యువజన విభాగాల ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు.

ఉద్యోగ, యువజన అజెండాపై ప్రత్యేక ఫోకస్

శాసనమండలిలో పట్టభద్రుల గొంతు కగా నిలవాలంటే విద్యావంతుల సమస్య లపై స్పష్టమైన వైఖరి ఉండా లనేది కేటీఆర్ ఆలోచన. నిరుద్యోగ భృతి, ఉద్యోగ నోటిఫికేషన్లు, ఉపాధ్యాయ మరియు ఉద్యో గుల డిమాండ్లు, తాత్కాలిక బోధకుల సమస్యలు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూనే, వీటికి బీ ప్రచారం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాం లో జరిగిన పారిశ్రామిక, సాంకేతిక అభివృద్ధిని, కల్పించిన ఉద్యోగావకాశాలను గుర్తు చేస్తూ నవతరంతో ప్రత్యక్ష సంభాషణలు జరుపుతున్నారు. డిజిటల్ అస్త్రం.. యువతతో మిగతా2లో



గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు ఎవరికి? రేవంత్ మనసులో ఏముంది.?

మూడు సీట్లు.. వందలాది ఆశలు.. తెలంగాణ రాజకీయాల్లో కాకరేపుతున్న నామినేటెడ్ స్థానాలు.!

తెలంగాణ శాసనమండలిలో గవర్నర్ కోటాలోని మూడు నామినేటెడ్ స్థానాల భర్తీపై రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇటీవల ఆయా స్థానాల పదవీకాలం ముగియడంతో, తదుపరి అవకాశాల కోసం అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్రస్థాయిలో పైరవీలు, కసరత్తులు జోరందుకున్నాయి.

ఇక పల్లె గడపకు హైస్పీడ్ ఇంటర్నెట్



తెలంగాణ పత్రిక ప్రతినిధి:తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సేవలను అందించేం దుకు 'భారత్‌నెట్' ప్రాజెక్టును వేగవంతం చేసింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ. 3,185 కోట్లు మంజూరు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో మిగతా2లో

తెలంగాణ వేదికగా జాతీయ రాజకీయాల సునామీ

రాహుల్ గాంధీ మాస్టర్ ప్లాన్ ఇదే..! అసలు రాహుల్ ఆలోచన ఏమిటి? కేసీఆర్, బీఆర్ఎస్ టార్గెట్‌గా హైకమాండ్ వ్యూహం! కుటుంబ పాలనపై ఉక్కుపాదం.. సామాజిక న్యాయమే అస్త్రంగా కాంగ్రెస్ అడుగులు



తెలంగాణ పత్రిక విశ్లేషణాత్మకమైన అస్పెషల్ స్టోరీ:

దేశ రాజకీయాల్లో దశాబ్దాలుగా వేళ్లూనుకున్న సంప్రదా యాలను మార్చాలని, కేవలం ఎన్నికల రాజకీయాలకే పరిమితం కాకుండా అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారంలో నిజమైన భాగస్వామ్యం కల్పించాలనే బలమైన సంకల్పంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముందుకు వెళుతున్నారు. దేశవ్యాప్తంగా ఆయన అనుసరిస్తున్న ఈ రాజ కీయ వ్యూహానికి తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం ప్రధాన కేంద్ర బిందువుగా మారుతోంది. గతంలో ఎన్నడూ లేనివి ధంగా ప్రాంతీయ పార్టీల ఆధిపత్యానికి చెక్ పెడుతూ, మిగతా2లో

30 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వార్డు అధికారి

రూ. 40 వేలు డిమాండ్.. చివరకు రూ. 30 వేలకు బేరం.. ఇంటిమ్యుటేషన్ కోసం డబ్బులు అడిగిన యెల్లంపేట మున్సిపల్ అధికారి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న రంగారెడ్డి రేంజ్ ఏసీబీ, కారులు..



తెలంగాణ పత్రిక ప్రతినిధి: అవినీతి నిరోధక శాఖ ఏసీబీ వలకు మరో ప్రభుత్వ అధికారి చిక్కాడు. ఇంటి ఆస్తి మ్యుటేషన్ చేసేందుకు లంచం తీసుకుంటూ యెల్లంపేట మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న వార్డు అధికారి డి. రవీందర్ రెడ్డి ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారులు మిగతా2లో



మేత కరవుతో రైతు కంట కన్నీరు..

సగానికి సగం ధరకే కాడెద్దుల విక్రయం నారాయణఖేడ్ సంతలో పశువుల విక్రయాల జోరు..?

తెలంగాణ పత్రిక ప్రతినిధి: రైతుల నిస్సహాయతను సొమ్ము చేసుకుంటున్న దళారులు నారాయణఖేడ్: వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం అన్నదా తలకు కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. పంటలు దెబ్బతినడమే కాకుండా, ఇప్పుడు రైతులకు వెన్నెముకగా ఉండే పశుసంపదను కాపాడుకోవడం కూడా పెను భారంగా మారింది. గ్రామాల్లో పశు గ్రాసం, తాగునీటికి తీవ్ర కొరత మిగతా2లో

ఈపీఎఫ్ఓ కీలక భేటీ కనీస పెన్షన్ రూ.3,000కు పెంపు

ఉద్యోగులు, పింఛనుదారుల్లో నెలకొన్న తీవ్ర ఉత్కంఠ..!



తెలంగాణ పత్రిక ప్రతినిధి :

కోట్లాది మంది ఉద్యోగులు మరియు పింఛనుదారులకు అత్యంత ఉత్కంఠ రేకెత్తించే వార్త వెలువడింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) త్వరలో నిర్వహించబోయే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ (జబీ) సమావేశంపై ప్రస్తుతం అందరి చూపు నిలిచింది. నవంబర్ 19, 2026న ఢిల్లీలోని ఈపీఎఫ్ఓ ప్రధాన కార్యాలయంలో 240వ సీబీటీ సమావేశం జరగనుంది. ఈ భేటీలో ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ (EPS) కింద ప్రస్తుతం ఇస్తున్న కనీస నెలవారీ పింఛనును రూ. 1,000 నుండి రూ. 3,000 వరకు పెంచే అవకాశం ఉందనే వార్త తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ఈ సీబీటీ మిగతా2లో



ఓటర్లకు శుభవార్త ఓటు నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం మరో బంపర్ అవకాశం.!

తెలంగాణ పత్రిక ప్రతినిధి: డిసెంబర్ 22 వరకు ఎస్ఐఆర్ (ꟻ×=) గడువు పొడిగింపు.. ముసాయిదాలో పేరు లేని వారికి కీలక సూచన హైదరాబాద్: రాష్ట్రంలోని అర్హులైన ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి శుభవార్త అందించింది. ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువును డిసెంబర్ 22 వరకు పొడిగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఇప్పటికే పలుమార్లు పొడిగించిన ఈ గడువును, ముసాయిదా జాబితాలో పేరు లేని అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో మరోసారి పెంచినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.

ముఖ్య తేదీలు ఓ పొడిగింపు వివరాలు:

ఆగస్టు 17న ప్రకటించిన వఓటర్లకు శుభవార్త ఓటు నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం మరో బంపర్ అవకాశం.!

ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేనివారు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించేందుకు ఈసీ మరో అవకాశం కల్పించింది. మిగతా2లో

పట్టభద్రుల పీఠమే టార్గెట్.. కేటీఆర్ 'మాస్టర్ ప్లాన్'.!

పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని ప్రతి మండలం, పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు, యువజన విభాగాల ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు.

ఉద్యోగ, యువజన అజెండాపై ప్రత్యేక ఫోకస్

శాసనమండలిలో పట్టభద్రుల గొంతుకగా నిలవాలంటే విద్యావంతుల సమస్యలపై స్పష్టమైన వైఖరి ఉండాలనేది కేటీఆర్ ఆలోచన. నిరుద్యోగ భృతి, ఉద్యోగ నోటిఫికేషన్లు, ఉపాధ్యాయ మరియు ఉద్యోగుల డిమాండ్లు, తాత్కాలిక బోధకుల సమస్యలు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూనే, వీటికి బీఆర్ఎస్ ఎలా అండగా నిలుస్తుందో ప్రచారం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పారిశ్రామిక, సాంకేతిక అభివృద్ధిని, కల్పించిన ఉద్యోగావకాశాలను గుర్తు చేస్తూ నవతరంతో ప్రత్యక్ష సంభాషణలు జరుపుతున్నారు.

డిజిటల్ అస్త్రం.. యువతతో నేరుగా అనుబంధం

కేటీఆర్‌కు సామాజిక మాధ్యమాల్లో ఉన్న విస్తృతమైన అనుచరగణం పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రధాన బలంగా మారింది. సాంకేతిక విద్యాసంస్థల సదస్సులు, కళాశాలల కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా క్యాంపస్ స్థాయిలో పరిచయాలు పెంచుకుంటున్నారు. అంతర్జాల సమావేశాలు, ప్రశ్నోత్తరాల వేదికల ద్వారా యువత అడిగే సందేహాలను నివృత్తి చేస్తూ వారిని ఆకట్టుకునే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు.

నాయకుల సమన్వయం.. అంతర్గత విభేదాలకు చెక్

ఎమ్మెల్సీ బరిలో నిలిచే అభ్యర్థి ఎంపికతో పాటు నియోజకవర్గ పరిధిలోని సీనియర్ నాయకులను సమన్వయం చేయడంపై కేటీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. గత ఎన్నికల్లో చోటుచేసుకున్న లోటుపాట్లను సరిదిద్దుకుంటూ, వర్గపోరుకు తావులేకుండా క్షేత్రస్థాయి సమీక్షలు నిర్వహిస్తున్నారు. పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి విభాగం మరియు మండలానికి ముందస్తుగానే ఇన్‌చార్జ్‌లను నియమించి బాధ్యతలు అప్పగించారు.

రాజకీయ వర్గాల విశ్లేషణ

పట్టభద్రుల నియోజకవర్గాలు ఎప్పుడూ ఒకే పార్టీకి అనుకూలంగా ఉంటాయని చెప్పలేం. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తమ ప్రభుత్వ పథకాలను నమ్ముతుండగా, బీజేపీ కూడా తమ పట్టు నిలుపుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఈ త్రైపాక్షిక పోటీలో బీఆర్ఎస్ విజయం కేటీఆర్ రచించే శ్రేణుల సమన్వయం, ఓటర్ల భాగస్వామ్యం మరియు విద్యావంతులైన యువతను ప్రభావితం చేసే విధానాలపైనే ఆధారపడి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు..

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు ఎవరికి?

తెలంగాణ శాసనమండలిలో గవర్నర్ కోటాలోని మూడు నామినేటెడ్ స్థానాల భర్తీపై రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇటీవల ఆయా స్థానాల పదవీకాలం ముగియడంతో, తదుపరి అవకాశాల కోసం అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్రస్థాయిలో పైరవీలు, కసరత్తులు జోరందుకున్నాయి. పేరుకు ఇవి గవర్నర్ నామినేషన్ ద్వారా భర్తీ అయ్యే సీట్లే అయినప్పటికీ, ఆచరణలో మాత్రం రాష్ట్ర మంత్రివర్గ సిఫార్సు మేరకు ముఖ్యమంత్రి నిర్ణయించే కీలక రాజకీయ ఎంపికలు కావడంతో ఆశావహుల సంఖ్య భారీగా పెరిగింది.

సిరిసిల్ల హామీ.. సామాజిక సమీకరణాలే కీలకం

రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సామాజిక న్యాయం, కుల ప్రాతినిధ్యం ప్రాతిపదికన ఈ ఎంపికలు జరగనున్నాయని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మూడు సీట్లలో ఒక స్థానాన్ని పద్మశాలీ సామాజిక వర్గానికి కేటాయిస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో సిరిసిల్ల బహిరంగ సభ వేదికగా స్పష్టమైన హామీ ఇచ్చారు. మరోవైపు కనీసం రెండు సీట్లు బీసీలకే కేటాయిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా సంకేతాలిచ్చారు. మరొక సీటు ముదిరాజ్ వర్గానికి దక్కే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతుండటంతో, ఇప్పుడు అందరి దృష్టి ఇంకా తేలని మూడో సీటుపైనే

రేసులో ప్రధాన నాయకులు ఉన్నారా లేదా సామాన్యులకే దక్కుతుందా

పద్మశాలీ కోటాలో కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు శాసనమండలిలో మొదటి మాదిగ ప్రతినిధికి అవకాశం కల్పించాలని ఆ సామాజిక వర్గ నేతలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఇక ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మున్నూరుకాపు కోటాలో సత్తు మల్లేశం, ఎస్సీ కోటాలో ఆరెపల్లి మోహన్, బ్రాహ్మణ కోటాలో హర్కర వేణుగోపాలరావు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. మంత్రివర్గంలో మున్నూరుకాపు సామాజిక వర్గానికి సరైన ప్రాతినిధ్యం లేదనే అసంతృప్తి నేపథ్యంలో, ఆ వర్గం ఈ సీటుపై గంపెడాశలు పెట్టుకుంది.

రేవంత్ రాజకీయ లెక్కలు - వ్యూహాలు

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల అంశం నేపథ్యంలో బీసీ వర్గాలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకి అత్యంత ఆవశ్యకంగా మారింది. సిరిసిల్ల భాగమేనని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. గతంలో మాల వర్గానికి చెందిన అద్దంకి దయాకర్‌కు అవకాశం ఇచ్చినందున, ఎస్సీ వర్గీకరణ అంశం తెరపైకి వచ్చిన ప్రస్తుత తరుణంలో మాదిగ వర్గానికి అవకాశం ఇవ్వాలనే డిమాండ్ పార్టీలో పెరుగుతోంది. యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం భావిస్తుండగా, సుదీర్ఘకాలంగా పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్లు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవుల కోసం నిరీక్షిస్తున్న నేతలు సైతం ఈ ఎమ్మెల్సీ సీట్లపై దృష్టి సారించారు.

ఢిల్లీ అధిష్ఠానం ముద్ర తప్పనిసరి

కాంగ్రెస్ అధిష్ఠానంతో ఢిల్లీలో క్షుణ్ణంగా చర్చించిన తర్వాతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తుది జాబితాను ఖరారు చేస్తారని గాంధీభవన్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి ఈ ఎంపిక కేవలం రాష్ట్ర నాయకత్వం నిర్ణయమే కాకుండా, అధిష్ఠానం ఆమోదం మరియు సామాజిక సమతుల్యత ఆధారంగా రూపుదిద్దుకోనుంది.

గవర్నర్ ఆమోదం మరో కీలక ఘట్టం

రాష్ట్ర మంత్రివర్గం పేర్లను ఖరారు చేసి పంపినప్పటికీ, రాజ్ భవన్ ఆమోద ముద్ర వేయడం మరో కీలక ఘట్టం. గతంలో నామినేటెడ్ ఎమ్మెల్సీల నియామక ప్రక్రియ సుదీర్ఘకాలం న్యాయ, సాంకేతిక వివాదాల్లో నలిగిన తర్వాత, గత ఏప్రిల్‌లో అజారుద్దీన్, ప్రొఫెసర్ కోదండరామ్‌ల నియామకానికి గవర్నర్ ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలో ఎలాంటి న్యాయపరమైన చిక్కులు తలెత్తని అభ్యర్థులను ఎంపిక చేయడం ప్రభుత్వానికి కీలకంగా మారింది. మొత్తం మూడు సీట్లలో సిరిసిల్ల హామీ మేరకు ఒకటి పద్మశాలీలకు, మరొకటి ఇతర బీసీ వర్గానికి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ వర్గాల్లో విశ్లేషణలు వినిపిస్తున్నాయి. మిగిలిన మూడో సీటు ఎస్సీ, ఎస్టీ, బ్రాహ్మణ లేదా మైనారిటీ వర్గాల్లో ఎవరిని వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ ఎంపిక ప్రక్రియ రేవంత్ రెడ్డి సామాజిక న్యాయ వ్యూహానికి, పార్టీలో ఆయన నాయకత్వ పటిమకు కీలక పరీక్షగా నిలవనుంది.

ఇక పల్లె గడపకు హైస్పీడ్ ఇంటర్నెట్

ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.3,185 కోట్లు మంజూరు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను విస్తరించే దిశగా మరో అడుగు పడింది. సవరించిన 'భారత్‌నెట్' పథకం కింద, కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిజిటల్ భారత్ నిధి, టి-ఫైబర్ మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించడంతో ప్రతి గ్రామీణ కుటుంబానికి హై-స్పీడ్ ఇంటర్నెట్‌ను అందించాలనే కల సాకారానికి మరింత దగ్గరైంది. ఈ కార్యక్రమం ఇప్పటికే పెద్దపల్లి, నారాయణపేట, సంగారెడ్డి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్‌లో అందుబాటులోకి తెచ్చిన ఏఐ ల్యాబ్ సేవలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఈ కొత్త ఒప్పందంతో గతంలో టి-ఫైబర్‌కు ఎదురొచ్చిన నిధుల కొరత సమస్య పరిష్కారమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం భారత్‌నెట్ పథకాన్ని ప్రారంభించింది. టి ఫైబర్ ద్వారా గ్రామాల్లో డక్ట్ వైర్ ఏర్పాటు చేసి, ప్రతి ఇంటికి ఇంటర్నెట్ సేవలను అందించడమే దీని లక్ష్యం. ప్రస్తుతం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని 1,179 గ్రామ పంచాయతీలు, 482 ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు కూడా టీ ఫైబర్ కనెక్షన్లను విస్తరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా రూ. 3,185 కోట్ల నిధులను కేటాయించడానికి ఆమోదం తెలపడంతో సేవల విస్తరణకు అడ్డుగా ఉన్న ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయి.

సరసమైన ధరకే సేవలు

ఇంటర్నెట్ కనెక్షన్ అవసరమైన రూటర్స్, కేబుళ్లు, ఇతర సామగ్రి కొనుగోలు చేయనున్నారు. దీని ద్వారా ఉమ్మడి జిల్లాలోని వినియోగదారులకు సరసమైన ధరకే హై-స్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుతాయి. ఇళ్లలో కంప్యూటర్లు, టెలివిజన్ల కోసం 4జీ, 5జీ నెట్‌వర్క్ సౌకర్యం లభిస్తుంది. ప్రస్తుతం గ్రామాల్లో ఫైబర్ పైపులు దెబ్బతింటున్నాయి. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల సేవలు పరిమితంగా లేదా సరిగ్గా అందడం లేదు. ఇప్పుడు తీసుకున్న ఈ కొత్త చర్యల ద్వారా సేవల్లో మెరుగైన మార్పులు రానున్నాయి.

జిల్లాల వారీగా కనెక్షన్ల వివరాలు

జిల్లా పంచాయతీలు	ప్రభుత్వ కార్యాలయాలు
కరీంనగర్ 308	140
పెద్దపల్లి 252	102
జగిత్యాల 365	140
సిరిసిల్ల 254	100

తెలంగాణ వేదికగా జాతీయ రాజకీయాల సునామీ

దేశ రాజకీయాల్లో దశాబ్దాలుగా వేళ్లూనుకున్న సంప్రదాయాలను మార్చాలని, కేవలం ఎన్నికల రాజకీయాలకే పరిమితం కాకుండా అట్టడుగు వర్గాలకు రాజ్యాధికారంలో నిజమైన భాగస్వామ్యం కల్పించాలనే బలమైన సంకల్పంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముందుకు వెళుతున్నారు. దేశవ్యాప్తంగా ఆయన అనుసరిస్తున్న ఈ రాజకీయ వ్యూహానికి తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం ప్రధాన కేంద్ర బిందువుగా మారుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రాంతీయ పార్టీల ఆధిపత్యానికి చెక్ పెడుతూ, ప్రజాస్వామ్య విలువలను పునరుద్ధరించడమే లక్ష్యంగా కాంగ్రెస్ హైకమాండ్ అడుగులు వేస్తోంది.

సామాజిక న్యాయమే అసలు అస్త్రం

రాహుల్ గాంధీ రాజకీయ వ్యూహంలో అత్యంత కీలకమైన అంశం సామాజిక సమతుల్యత మరియు కుల గణన. దేశంలో ఏ వర్గానికి ఎంత జనాభా ఉందో, ఆ మేరకే సంపదలో, అధికారంలో వాటా దక్కాలనే డిమాండ్‌ను ఆయన బలంగా తెరపైకి తెచ్చారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టింది. కుల గణన సర్వేను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టి, వెనుకబడిన వర్గాలకు, దళితులకు, గిరిజనులకు రాజకీయంగా మరియు ఆర్థికంగా పెద్దపీట వేసేలా విధానాలు రూపుదిద్దుకుంటున్నాయి. జాతీయ స్థాయిలో బీజేపీని సైతం సైద్ధాంతికంగా ఎదుర్కొనేందుకు రాహుల్ గాంధీ ఎంచుకున్న ప్రధాన మార్గం ఇదే కావడం గమనార్హం.

కుటుంబ, అవినీతి రాజకీయాలపై ఉక్కుపాదం

తెలంగాణ రాజకీయాలపై రాహుల్ గాంధీ ప్రత్యేక దృష్టి పెట్టడానికి ప్రధాన కారణం ఇక్కడి ప్రాంతీయ పార్టీల వైఖరే. దశాబ్దాల పాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీపై ప్రజాధనం దుర్వినియోగం, ఫామ్‌హౌస్ సంస్కృతి, అవినీతి ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ ఆక్రమణలు, ప్రాజెక్టుల పేరుతో జరిగిన దోపిడీని ఒక్కొక్కటిగా వెలికితీసేలా స్థానిక నేతలకు హైకమాండ్ స్పష్టమైన దిశానిర్దేశం చేసింది. అందులో భాగంగానే సిరిసిల్ల, సిద్దిపేట లాంటి ప్రాంతాలను కేంద్రంగా చేసుకుని ప్రతిపక్ష నేతల బండారాన్ని బట్టబయలు చేసే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, చట్టపరమైన ఆధారాలతో ప్రజల ముందు వాస్తవాలు ఉంచాలనేది రాహుల్ గాంధీ స్పష్టమైన ఆదేశంగా ఉంది.

తెలంగాణను రోల్ మోడల్‌గా మార్చడమే లక్ష్యం

దక్షిణాదిలో కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా మారిన తెలంగాణను దేశానికే ఒక పరిపాలనా నమూనాగా చూపించాలని హైకమాండ్ భావిస్తోంది. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూనే, మరోవైపు రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడిన పెట్టడం, ప్రజా పాలన అందించడంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని రాహుల్ గాంధీ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అవినీతిరహిత పాలనను అందించడం ద్వారా కుటుంబ పాలనకు, ప్రజాస్వామ్య పాలనకు మధ్య వ్యూహంలోని అసలు రహస్యం.

ముగింపు

మొత్తంగా చూస్తే, రాహుల్ గాంధీ వ్యూహం కేవలం ఒక్క రాష్ట్రానికి సంబంధించినది కాదు. దేశ రాజకీయ దిశను మార్చే మార్పునకు తెలంగాణను ప్రయోగశాలగా మలచాలనేదే ఆయన అసలు ఉద్దేశం. ప్రాంతీయ పార్టీల అహంకారాన్ని అణచివేస్తూ, సామాజిక న్యాయం మరియు పారదర్శక పాలనే ప్రాతిపదికగా కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే రాహుల్ గాంధీ వేస్తున్న అడుగుల వెనుక ఉన్న అసలు మాస్టర్

30 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వార్డు అధికారి

ఏసీబీ అధికారులు విడుదల చేసిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారుడి తండ్రి పేరు మీద ఉన్న ఇంటిని తన పేరుపై మార్చుకునేందుకు (మ్యుటేషన్) యెల్లంపేట మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ పని పూర్తి చేసేందుకు వార్డు అధికారి రవీందర్ రెడ్డి తొలుత రూ. 40 వేల లంచం డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనని ఫిర్యాదుదారుడు వేడుకోవడంతో చివరకు రూ. 30 వేలకు బేరం కుదుర్చుకున్నాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు రంగారెడ్డి రేంజ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అధికారుల సూచన మేరకు శుక్రవారం ఫిర్యాదుదారుడి నుంచి రూ. 30 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మాటువేసి రవీందర్ రెడ్డిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అధికారిక హోదాను దుర్వినియోగం చేసినందుకు గాను నిందితుడిని అరెస్టు చేసి, నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు అధికారులు తెలిపారు. లంచం అడిగితే 1064కు కాల్ చేయండి: ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు గానీ, వాట్సాప్ నంబర్ 9440446106 కు గానీ ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు..

మేత కరవుతో రైతు కంట కన్నీరు..

సంపదను కాపాడుకోవడం కూడా పెను భారంగా మారింది. గ్రామాల్లో పశుగ్రాసం, తాగునీటికి తీవ్ర కొరత ఏర్పడటంతో, కన్నబిడ్డల్లా పెంచుకున్న మూగజీవాలను పోషించలేక రైతులు కన్నీళ్లతో సంత బాట పడుతున్నారు.

వరిగడ్డి కొరత.. ఎండిన జలాశయాలు

ఈ ఏడాది వరి సాగు గణనీయంగా తగ్గిపోవడంతో పశువులకు ప్రధాన ఆహారమైన వరిగడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. మరోవైపు చెరువులు, కుంటలు, వాగులు పూర్తిగా ఎండిపోవడంతో మూగజీవాలకు గుక్కెడు తాగునీరు కూడా దొరకడం లేదు. ఈ పరిస్థితుల్లో పశువుల ఆకలి తీర్చలేక రైతులు భారమైన హృదయంతో వాటిని అమ్ముకునేందుకు సిద్ధమవుతున్నారు.

సంతకు పోటెత్తిన మూగజీవాలు

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలో ప్రతి మంగళవారం జరిగే పశువుల సంతకు తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక నుంచి రైతులు, వ్యాపారులు వస్తుంటారు. సాధారణంగా ఈ సంతకు వారానికి సుమారు 2 వేల పశువులు వస్తుండగా, ప్రస్తుతం మేత కరవు కారణంగా ఏకంగా 5 వేలకు పైగా పశువులను అమ్మకానికి తీసుకొస్తున్నారు. నారాయణఖేడ్, మానూర్, నాగలిగిద్ద, కంగ్టి, సిర్గాపూర్, కల్హేర్, నిజాంపేట్, పెద్ద శంకరంపేట్ మండలాలకు చెందిన రైతులు పెద్ద ఎత్తున పశువులను సంతకు తరలిస్తున్నారు.

రైతుల అవసరమే దళారులకు వరంగా..

ఇంకా పదేళ్లపాటు వ్యవసాయ పనులకు ఉపయోగపడే బలమైన, రూ.లక్షకు పైగా విలువ చేసే కాడెద్దులను కూడా గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు కేవలం రూ.50 వేలకే అమ్ముకోవాల్సి వస్తోంది. స్థానికంగా కొనుగోలుదారులు లేకపోవడంతో, రైతుల నిస్సహాయతను దళారులు, పొరుగు రాష్ట్రాల వ్యాపారులు ఆసరాగా చేసుకుని అతి తక్కువ ధరలకే పశువులను కొనుగోలు చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

పశుసంపద పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి రాయితీపై పశుగ్రాసం సరఫరా చేయాలని, గ్రామాల్లో మూగజీవాలకు తాగునీటి వసతి కల్పించాలని వారు కోరుతున్నారు.!

ఈపీఎఫ్ఓ కీలక భేటీ కనీస పెన్షన్ రూ.3,000కు పెంపు

ఈ భేటీలో ఎంప్లాయీస్ పెన్షన్ స్కీమ్ (ఈపీఎస్) కింద ప్రస్తుతం ఇస్తున్న కనీస నెలవారీ పింఛనును రూ.1,000 నుండి రూ.3,000 వరకు పెంచే అవకాశం ఉందనే వార్త తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ఈ సీబీటీ సమావేశం గుజరాత్‌లోని గిర్‌లో జరగాల్సి ఉండగా కొన్ని పరిపాలనా కారణాల వల్ల వేదికను ఢిల్లీకి మార్చారు. నవంబర్ 4, 2026 నాటి లేఖ ప్రకారం రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ సుబ్రతా భౌమిక్ ఈ భేటీకి సంబంధించిన వివరాలను సీబీటీ సభ్యులందరికీ అధికారికంగా తెలిపారు. ఈ సమావేశంలో కనీస ఈపీఎస్ పెన్షన్ పెంపు అంశమే ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. కాబట్టి ప్రభుత్వం నుంచి తుది ఆమోదం లభించే వరకు పింఛనుదారులు ఈ రూ.3,000 పెంపు వార్తను కేవలం పరిశీలనాత్మక ప్రచారంగానే భావించాలని నిపుణులు సూచిస్తున్నారు. సెప్టెంబర్ 2014 నుంచి కనీస నెలవారీ పింఛను రూ.1,000 వద్దే నిలిచిపోయింది. మరోవైపు నిత్యావసరాల ధరలు, వైద్య ఖర్చులు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో ఈ కొద్ది మొత్తంతో జీవనం సాగించడం అసాధ్యమని పింఛనుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కనీస పింఛనును కనీసం రూ.7,500కి పెంచి దానికి కరువు భత్యా (DA) జోడించాలని వివిధ ఉద్యోగ, పింఛనుదారుల సంఘాలు ఎప్పటి నుంచో పోరాడుతున్నాయి. ఈపీఎస్ అనేది ఆర్గనైజ్డ్ రంగంలోని ఉద్యోగుల కోసం ఈపీఎఫ్ఓ ద్వారా నిర్వహించబడే రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీమ్. ఉద్యోగి జీతం నుంచి ప్రతి నెలా 12 శాతం పీఎఫ్ ఖాతాకు జమ కాగా, యజమాని కూడా అంతే సమానంగా 12 శాతం విరాళం అందిస్తారు. యజమాని చెల్లించే 12 శాతంలో 8.33 శాతం నిధులు ఈపీఎస్ ఖాతాకు, మిగిలిన 3.67 శాతం ఈపీఎఫ్ ఖాతాకు వెళ్తాయి. ప్రస్తుతం కనీస పింఛను రూ.1,000గా ఉన్న నేపథ్యంలో నవంబర్ 19న జరిగే సీబీటీ సమావేశం తర్వాత దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ సుదీర్ఘ లబ్ధిదారుల నిరీక్షణకు మోడీ ప్రభుత్వం ఎలాంటి ముగింపు పలుకుతుందో వేచి చూడాలి...

ఓటర్లకు శుభవార్త ఓటు నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం మరో బంపర్ అవకాశం.!

ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి శుభవార్త అందించింది. ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువును డిసెంబర్ 22 వరకు పొడిగిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఇప్పటికే పలుమార్లు పొడిగించిన ఈ గడువును, ముసాయిదా జాబితాలో పేరు లేని అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశంతో మరోసారి పెంచినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.

ముఖ్య తేదీలు ఉ పొడిగింపు వివరాలు:

ఆగస్టు 17న ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేనివారు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించేందుకు ఈసీ మరో అవకాశం కల్పించింది.

ముసాయిదా జాబితా నుంచి ఓటు తొలగించబడిన వారికి ఈ నెల 30 వరకు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, డిసెంబర్ 10 నాటికి వాటిని పరిష్కరించనున్నారు.

ఆగస్టు 17 నుంచి కొనసాగుతున్న నోటీసుల ప్రక్రియ గడువును డిసెంబర్ 15 వరకు పొడిగించారు.

మొత్తంగా నోటీసులు, అభ్యంతరాల స్వీకరణ, కొత్త దరఖాస్తుల పరిష్కారానికి డిసెంబర్ 22 వరకు తుది గడువుగా నిర్ణయించారు.

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ, నాగాలాండ్, హర్యానా, జార్ఖండ్ రాష్ట్రాల్లోనూ ఎస్ఐఆర్ గడువును ఈసీ పొడిగించింది.

70 లక్షల ఓట్ల తొలగింపు.. 2.70 కోట్లతో జాబితా:

మరోవైపు రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పటికే దాదాపు కొలిక్కి వచ్చింది. ఈ సవరణ ప్రక్రియలో సుమారు 70 లక్షల అనర్హుల ఓట్లు తగ్గి, దాదాపు 2.70 కోట్ల ఓట్లతో జాబితా సిద్ధమైంది. తొలగించిన ఓట్లలో ఎక్కువగా రెండు చోట్ల ఓటు హక్కు కలిగిన వారే ఉన్నారని అధికారులు స్పష్టం చేశారు.

సీఈవో కీలక సూచన:

గతంలో ఎన్యుమరేషన్ ఫారం సమర్పించలేకపోయిన అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఈవో సుదర్శన్ రెడ్డి కోరారు. తుది జాబితా ప్రకటించిన తర్వాత కూడా ఏ కారణం చేతనైనా అర్హుల పేరు లేకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంటుందని సీఈవో కార్యాలయం భరోసా ఇచ్చింది. సందేహాలు, సహాయం కోసం స్థానిక బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ)ని గానీ, 1950 టోల్‌ఫ్రీ నంబర్‌ను గానీ సంప్రదించాలని అధికారులు సూచించారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని 38వ వార్డులో ప్రారంభించిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ





కామారెడ్డి, నవంబర్ 20, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని కామారెడ్డి పట్టణంలోని 15వ వార్డులో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. కుటుంబ పెద్దకు ఏదైనా అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా అండగా నిలవడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంఘ్వాన్ , మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్లు గిరి, శ్రీధర్, స్థానిక కౌన్సిలర్ వనిత రాంమోహన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్, సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యక్షులు పండ్ల రాజు, రాజేశ్వర్, గొనె శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మహిళలు, వార్డు ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి కల్లా శ్రీరాంపురం చెరువుకు గోదావరి జలాలు

-నాగుపల్లి సీతారామ కాలువ పనులు డిసెంబరులోగా పూర్తి చేయాలి
-గండ్లు పడిన చెరువులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి
-అధికారులను ఆదేశించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తెలంగాణ పత్రిక దమ్మపేట, నవంబర్ 20

వచ్చే సంక్రాంతి పండుగ నాటికి శ్రీరాంపురం చెరువులోకి గోదావరి జలాలను విడుదల చేసేలా నాగుపల్లి సీతారామ కాలువ పెండింగ్ పనులను వేగవంతం చేసి, డిసెంబర్ నెలలోగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పనుల్లో ఎలాంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. శుక్రవారం దమ్మపేట మండలం గండుగులపల్లిలోని తన నివాసం నుంచి సీఈ శ్రీనివాస్ రెడ్డికి ఫోన్ చేసి కాలువ పనుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. నాగుపల్లి సీతారామ కాలువకు సంబంధించి మిగిలిపోయిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పనులు పూర్తయిన వెంటనే గోదావరి జలాలను శ్రీరాంపురం చెరువుకు తరలించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.



గండ్లు పడిన చెరువులకు తక్షణ మరమ్మతులు

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుఫాను ప్రభావంతో దమ్మపేట మండల పరిధిలోని పలు చెరువులకు గండ్లు పడి దెబ్బతిన్న నేపథ్యంలో వాటి పరిస్థితిని మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న చెరువులకు వెంటనే మరమ్మతులు చేపట్టి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పునరుద్ధరించాలని సూచించారు. మండలంలోని ప్రతి చెరువులో నీరు నిల్వ ఉండేలా అవసరమైన చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని స్పష్టం చేశారు. సాగునీటి వనరులను కాపాడటంతో పాటు రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి రామచంద్రప్రసాద్, పైడి వెంకటేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

-ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంతో కుటుంబాలకు ఆర్థిక భరోసా
-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 20 నవంబర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దేశంలోనే ఒక వినూత్న కార్యక్రమమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం, మెదక్ జిల్లాలో చేగుంట మండలం కర్నాల్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కార్యక్రమానికి కలెక్టర్ హాజరై, లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఈ పథకం వివరాలను ప్రజలకు తెలియజేశారు. ఈ పథకం ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తుందని అన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ముఖ్య ఉద్దేశంలి

సాధారణంగా ఎల్ఐసీ వంటి జీవిత బీమా పథకాల కోసం ప్రజలు ప్రతి ఏటా సొంతంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద రాష్ట్రంలోని కోటి పైచిలుకు కుటుంబాలకు ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుందని తెలిపారు. తద్వారా ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వర్తింపజేస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించుకోవాలని సూచించారు. అర్హత వయసు18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల లోపు వయసు ఉన్న కుటుంబ సభ్యుల పేరు మీద బీమా తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. పుట్టిన తేదీ నిర్ధారణకు ఆధార్ కార్డులో ఉన్న తేదీనే ప్రామాణికంగా తీసుకుంటారని, క్యాంపులకు వచ్చే ముందు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డును వెంట తీసుకురావాలని సూచించారు.





అర్హులైన ప్రతి ఒక్కరికీ వర్తింపు

ఈ పథకంలో పేద, ధనిక, ఏపీఎల్, బీపీఎల్ అనే తేడాలు లేవని, గ్రామంలోని ప్రతి కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. రైతు బీమా ఉన్న వారికి కూడా ఈ పథకం వర్తిస్తుందని, రైతు బీమాతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

నామినీ ఎంపిక లబ్ధిదారుడిదే

బీమా ద్వారా వచ్చే మొత్తాన్ని (ఉదాహరణకు రూ.5 లక్షలు) ఎవరికి ఎంత వాటా ఇవ్వాలనేది కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చని తెలిపారు. పిల్లల పేరు మీద గానీ, భార్యాభర్తల పేరు మీద గానీ, ఇద్దరు పిల్లలు ఉంటే 50-50 శాతం (లేదా) ఇతర విధంగా తమ ఇష్టానుసారం వాటాలను కుటుంబ సభ్యులు నిర్ణయించుకోవచ్చని వివరించారు. ఈ గ్రామంలో సుమారు 700 కుటుంబాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేషన్ కార్డు ఉంటే దానిని సమర్పించాలని, లేని పక్షంలో అందుబాటులో ఉన్న ఫారాన్ని పూర్తి చేసి ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఫారంలో పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని, అనంతరం నమోదు చేసిన వివరాలను మరోసారి సరిచూసుకోవాలని తెలిపారు. గతంలో రైతు బీమా నమోదు చేసుకున్న వారికి కూడా ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో నిర్దేశించిన వ్యవధి లోపు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. క్యాంపులకు తరలి వచ్చే లబ్ధిదారులకు తగిన వసతులు కల్పించాలని, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి డి డబ్లు ఓ హేమ భార్గవి , ఎంపీడీవో చెన్నారెడ్డి, తాసిల్దార్ బాల లక్ష్మి గ్రామ సర్పంచ్ దుర్గా రామ గౌడ్ ,సిబ్బంది, అధిక సంఖ్యలో ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవి ఇందిరమ్మ జీవిత బీమా

-చేవెళ్ల కేజీఆర్ గార్డెన్‌లో నూతన పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్ నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూధన్ రెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 20,(తెలంగాణ పత్రిక)



నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన "ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం" చేవెళ్ల నియోజకవర్గంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్మయి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూధన్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. కుటుంబ పెద్దకు ఏదైనా జరగరానిది జరిగితే ఆ కుటుంబం ఆర్థికంగా చిన్నాభిన్నం కాకుండా ఈ బీమా పథకం రక్షణ కవచంలా నిలుస్తుందని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా ఈ బీమా వర్తించేలా చూడాలని కలెక్టర్ నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్మయిలు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను క్షేత్రస్థాయిలో అర్హులైన పేదలందరికీ చేరవేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కాలే యాదయ్య, గ్రంథాలయ చైర్మన్ మధుసూధన్ రెడ్డిలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పార్థసింహారెడ్డి , మున్సిపల్ చైర్‌పర్సన్ సమతా వెంకటరెడ్డి, సోనియా దర్శన, మార్కెట్ చైర్మన్, ఎమ్మార్వో, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు మరియు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

గణేష్‌పాడులో తెలంగాణ రక్షణసేన విస్తృత ప్రచారం

-భూలక్ష్మి, పంచజన్య పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించిన సోడెం వెంకట్



తెలంగాణ పత్రిక దమ్మపేట, నవంబర్ 20

అశ్వారావుపేట నియోజకవర్గంలో తెలంగాణ రక్షణసేన మేనిఫెస్టోలోని అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రామగ్రామాన విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దమ్మపేట మండలంలోని గణేష్‌పాడు గ్రామంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ సోడెం వెంకట్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం చేపట్టారు.

ప్రజల సమస్యలపై ఆరా..

ఈ సందర్భంగా సోడెం వెంకట్ గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకున్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం వంటి కీలక అంశాలపై చర్చించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తమ మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలను వివరించారు.

భూలక్ష్మి, పంచజన్య పథకాలపై వివరణ..

తెలంగాణ రక్షణసేన మేనిఫెస్టోలోని భూలక్ష్మి పథకం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా పంచజన్య పథకాల లక్ష్యాలు, ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేస్తూ, ఆయా పథకాల ద్వారా సమాజంలోని వివిధ వర్గాలకు కలిగే ప్రయోజనాలను వివరించారు.

ప్రతి కుటుంబానికి మేనిఫెస్టో చేరవేతే లక్ష్యం..

గ్రామాల్లో ప్రతి కుటుంబాన్ని కలుసుకుని మేనిఫెస్టోలోని అంశాలను వివరించడమే తమ ప్రచార లక్ష్యమని సోడెం వెంకట్ తెలిపారు. ప్రజల సమస్యలు, అభిప్రాయాలను స్వయంగా తెలుసుకుంటూ, వారి ఆకాంక్షలకు అనుగుణంగా మేనిఫెస్టోలోని హామీలను వివరిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేలా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.

గోకారం--చంద్రాయన్ పల్లి పెద్ద చెరువును పునరుద్ధరించాలి

-ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేసిన సర్పంచ్ శంకర్



తెలంగాణ పత్రిక చారకొండ , నవంబర్ 20:

నాగర్ కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో గోకారం--చంద్రాయన్ పల్లి గ్రామ పెద్ద చెరువును పునరుద్ధరించి, ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలని చంద్రాయన్ పల్లి గ్రామ సర్పంచ్ చిలికేశ్వరం శంకర్ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. ఈ మేరకు గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ శంకర్ మాట్లాడుతూ.. గోకారం--చంద్రాయన్ పల్లి పెద్ద చెరువు కింద వందలాది ఎకరాల వ్యవసాయ భూములు ఆయకట్టుగా ఉన్నాయని, గతంలో ఈ చెరువు నీటితో రైతులు పంటలు సాగు చేసుకునేవారని వివరించారు. ప్రస్తుతం చెరువుకు నీరు అందకపోవడంతో ఆయకట్టు భూములకు సాగునీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నీటి వసతి లేక పచ్చని పంట పొలాలు క్రమంగా బీడుభూములుగా, ఎడారిని తలపించేలా మారుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పెద్ద చెరువును త్వరితగతిన పునరుద్ధరించి, ఆయకట్టు భూములకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ శంకర్ ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు.దీనిపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, సమస్య పరిష్కారానికి అతి త్వరలోనే తగిన మార్గం చూపిస్తానని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేరంగుల వెంకటయ్య, మాజీ వైస్ ఎంపీపీ సాంబయ్య గౌడ్, మాజీ ఉప సర్పంచ్ పర్వతాలు, ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంగరి శివశంకర్, బాధగొని వెంకటయ్య, సి.హెచ్. మహేందర్, జమ్ముల శేఖర్, జమ్ముల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ బియ్యం సరఫరా కేంద్రంలో తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ

-నిల్వలు, రికార్డుల పరిశీలన.. పంపిణీలో పారదర్శకత పాటించాలని అధికారులకు ఆదేశం



దమ్మపేట, నవంబర్ 20

మండల కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ బియ్యం సరఫరా కేంద్రాన్ని తహసీల్దార్, శిక్షణ కలెక్టర్ మద్దినేని మురళి గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గిడ్డంగిలో నిల్వ ఉన్న బియ్యం పరిమాణాన్ని, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు అందించే బియ్యం సరఫరాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. బియ్యం తూకం, కొలతల విషయంలో పూర్తి జాగ్రత్తలు పాటించాలని, అర్హులకు నిర్ణీత పరిమాణంలో బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సరఫరా ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. గిడ్డంగిలో బియ్యం నిల్వలు, రికార్డుల నిర్వహణను పరిశీలించిన అనంతరం అక్కడి పరిస్థితులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో ఉప తహసీల్దార్ బద్రు, గిడ్డంగి బాధ్యులు కొయ్యల పాంచాలి, సిబ్బంది దండు శ్రీనివాసరావు, రొయ్యల ప్రసాద్, హమాలీలు పాల్గొన్నారు.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA
TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా బిజినెస్

ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసిన అధికారులు



కామారెడ్డి ,నవంబర్ 20, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాబీబీపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్లకు పార్టీ నాయకులు గ్రామ సర్పంచ్ ఉపసర్పంచ్ ముగ్గు పోయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి శ్రీనివాస్ మండల తహశీల్దార్ గంగాసాగర్ సొసైటీ చైర్మన్ సుతారి రమేష్ గ్రామ సర్పంచ్ సద్విక ఉపసర్పంచ్ ప్రశాంత్ కుమార్ జిల్లా నాయకులు సలీం వార్డు సభ్యులు యూత్ నాయకులు మహేష్ స్వామికమిటీ సభ్యులు గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ మొదలగువారు పాల్గొన్నారు.

కల్వకుర్తి నియోజకవర్గం లో వివాహ వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన ఉప్పల వెంకటేష్



కల్వకుర్తి నవంబర్. 20 తెలంగాణ పత్రిక

కల్వకుర్తి నియోజవర్గంలో వివిధ ప్రాంతాలలో నిర్వహించిన వివావా వేడుకలలో పాల్గొని నూతనవధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది తెలంగాణ మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ అదేవిధంగా గృహప్రవేశ కార్యక్రమాలలో హాజరై ఆ కుటుంబ సభ్యులనుఆశీర్వదించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది ఉప్పల వెంకటేష్.

ప్రమాదకరంగా మారిన ట్రాన్స్ఫార్మర్ ను వెంటనే అక్కడి నుండి తొలగించాలి

-మాజీ వార్డు సభ్యులు తాళ్ల శ్రీనివాస్ గౌడ్.



రాజేంద్రనగర్ ప్రతినిధి నవంబర్ 20 తెలంగాణ పత్రిక .

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని చౌదరిగుడ గ్రామ చౌరస్తా వద్ద ట్రాన్స్ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఆ పైగా మూలమలుపు వద్దనే ట్రాన్స్ఫార్మర్లు బిగించడంతో ఎదురు ఎదురుగా వస్తున్న వాహనాలు అదుపుతప్పి ట్రాన్స్ఫార్మర్ను ఢీకొనే ప్రమాదం పొంచి ఉంది. ఉదయం సాయంత్రం స్కూల్ కి వెళ్లే విద్యార్థులు అక్కడే రాకపోకలు కొనసాగిస్తుండడంతో ప్రమాదం పంచి ఉంది. పెద్ద షాపూర్ నుండి చౌదరిగుడ మీదుగా వివిధ గ్రామాలకు వెళ్లే ఈ మార్గం రద్దీగా ఉంటుంది ఆ ప్రదేశంలో ట్రాన్స్ఫార్మర్ ఉంది. ఎటువంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి వెంటనే ట్రాన్స్ఫార్మర్లను అక్కడ నుండి తొలగించి వేరేచోట బిగించాలని చౌదరిగుడ గ్రామ సీనియర్ నాయకులు మాజీ వార్డు సభ్యులు తాళ్ల శ్రీనివాస్ గౌడ్ సూచించారు.



ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ సర్పంచ్

-దామరచెరువులో కాంగ్రెస్‌కు మరింత బలం.. ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిక

మెదక్ జిల్లాప్రతినిది (తెలంగాణ పత్రిక) 21 నవంబర్



రామాయంపేట మండలం దామరచెరువు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ సర్పంచ్ టంకరి గీతాంజలి దానియేల్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న ప్రాధాన్యత, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషికి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు నాయకత్వాన్ని ప్రశంసిస్తూ, ఆయన ఆధ్వర్యంలో మెదక్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే చేస్తున్న కృషి ఇతర పార్టీల నాయకులను సైతం ఆకర్షిస్తోందని స్థానిక కాంగ్రెస్ శ్రేణులు పేర్కొన్నాయి.

విజ్ఞాన వికాసానికి వేదికగా మండల స్థాయి క్విజ్ పోటీలు



-మండల స్థాయి క్విజ్ పోటీలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ జిల్లాప్రతినిది (తెలంగాణ పత్రిక) 20 నవంబర్

గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, వారిలో పోటీతత్వాన్ని పెంపొందించడం మరియు సాధారణ పరిజ్ఞానం (జనరల్ నాలెడ్జ్) పట్ల ఆసక్తిని కలిగించాలనే ఉన్నత లక్ష్యంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో, చిన్న శంకరంపేట్ మండల కేంద్రంలోని కేజీ విబి పాఠశాలలో, జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలు కేజీవిబీ మరియు మోడల్ స్కూల్ లలోవిద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలను ఘనంగా నిర్వహించడం జరిగింది. శుక్రవారం కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. క్విజ్ జరుగుతున్న తీరును, విద్యార్థులకు అడుగుతున్న జనరల్ నాలెడ్జ్, సైన్స్, గణితం మరియు సాంఘిక శాస్త్ర ప్రశ్నల ప్రమాణాలను పరిశీలించారు. విద్యార్థులతో పోటీలలో పాల్గొన్న విద్యార్థులతో మాట్లాడి వారిని



ప్రోత్సహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ

విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పోటీ పరీక్షలలో రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. పాఠ్యపుస్తకాలతో పాటు సమకాలీన అంశాలపై (కరెంట్ ఎఫైర్) అవగాహన పెంచుకోవాలని సూచించారు.విద్యార్థుల్లో పుస్తక పఠనం మరియు వార్తాపత్రికలు చదివే అలవాటు పెరిగిందని సూచించారు.రాబోయే జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు సిద్ధమవడానికి ఇది ఒక చక్కని వేదికగా మండల స్థాయి క్విజ్ పోటీలు నిలుస్తాయన్నారు. చెప్పారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో ఇలాంటి విద్యా సంబంధిత కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామన్నారు.

తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద జీవిత బీమా పథకం ప్రారంభం

-పడకల్ గ్రామాన్ని ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం

-ప్రారంభించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి నవంబర్. 20 తెలంగాణ పత్రిక

తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పైలెట్ ప్రాజెక్టు కింద జీవిత బీమా పథకాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఘనంగా ప్రారంభించారు.మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి జీవిత బీమా పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తలకొండపల్లి మండలంలో పడకల్ గ్రామాన్ని ఎంపిక చేయడం గ్రామస్తులకు ఎంతో గర్వకారణమని గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం



చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేద, మధ్య తరగతి కుటుంబాలకు జీవిత బీమా ఎంతో భరోసానిస్తుందని అన్నారు. కుటుంబ పెద్దకు ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినా, కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా నిలదొక్కుకోవడానికి ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ప్రతి కుటుంబం బీమా పరిధిలోకి రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, పడకల్ గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే మండలంలోని అన్ని గ్రామాలకు, తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని విస్తరిస్తామని ఆయన స్పష్టం చేశారు.గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో చేరి లబ్ధి పొందాలని, ఎవరూ మిగిలిపోకుండా చూడాలని అధికారులకు సూచించారు. బీమా పథకం గురించి గ్రామంలో విస్తృతంగా అవగాహన కల్పించాలని, ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి మండల స్పెషల్ ఆఫీసర్ అంకం రాజు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, బీమా సంస్థ ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదలకు సొంతింటి కల.. పల్లెలకు నాణ్యమైన వైద్యం

-ఆరోగ్యం, ఆవాసం ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతలు

-చిలుకూరులో సబ్ సెంటర్, మేడిపల్లిలో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 20,(తెలంగాణ పత్రిక)

నిరుపేద కుటుంబాలకు సొంతింటి భరోసా కల్పించడం, గ్రామీణ ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలను చేర్చడం తమ ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యతలని చేవెళ్ల శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య గారు స్పష్టం చేశారు. శుక్రవారం మొయినాబాద్ ప్రాంతంలో పర్యటించిన ఆయన, పలు నూతన భవనాలను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. తొలుత మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం (సబ్ సెంటర్) భవనాన్ని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం



రం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. ప్రజలు అత్యవసర మరియు ప్రాథమిక చికిత్సల కోసం పట్టణాలకు పరుగులు తీసే అవసరం లేకుండా, స్థానికంగానే మెరుగైన వైద్యం అందేలా ఈ ఉప కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. తదుపరి కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన నూతన ఇందిరమ్మ ఇంటిని



ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. నూతన గృహంలోకి అడుగుపెడుతున్న లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల మరియు మున్సిపల్ స్థాయి ప్రభుత్వ అధికారులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులు పండించిన పంటలకు రైతులే ధరలు నిర్ణయించే స్థాయి కి ఎదగాలి.త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

కల్వకుర్తి నవంబర్ 20 తెలంగాణ పత్రిక

కల్వకుర్తి నియోజకవర్గం . దేశంలోని రైతులందరూ తాము పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు నిర్ణయించే స్థాయికి ఎదిగినప్పుడే దేశం బాగుపడుతుందని త్రిపుర గవర్నర్ నల్లు నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. శుక్రవారం తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో మహీధర ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ వారిచే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభానికి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. అనంతరం కంపెనీ జనరల్ బాడీ మీటింగ్ లో పాల్గొన్నారు ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ మై ధర ఫార్మర్స్ అండ్ ప్రొడ్యూసర్ కంపెనీ దేశంలోని అత్యుత్తమ స్థాయికి ఎదగాలని కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా గుజరాత్ రాష్ట్రంలో రైతులు ఎంతో ప్రగతి సాధించారని ఆదర్శంగా తీసుకుని ప్రధానమంత్రి నరేంద్ర ప్రతి రైతు సాయిల్ కార్డులు తీసుకోవాలని మోడీ దేశమంతయు విస్తరించాలని సొసైటీలకు కేంద్ర ప్రభుత్వము అన్ని



రకాల సహాయ సహకారాలు అందిస్తుందని దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులందరూ సాయిల్ కార్డులు తీసుకొని అందుకు తగ్గట్టు పంటలు వేసుకోవాలని సూచించారు. మనదేశంలో మంచి నూనె కొరత తీర్చడానికి 50 శాతం ఐదు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని దీనిని అధిగమించాలంటే రైతులు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలు చదివినంగా చేసుకుని పామాయిల్ పంటలను సాగు చేయాలని సూచించారు ఇప్పుడు ఏర్పడిన కరువు గతంలో 2000 సంవత్సరములో



వచ్చినదని దానిని అధిగమించాలంటే రైతులందరూ ఉన్న నీటిని సద్వినియోగం చేసుకొని పంటలను సాగు చేసి లాభాలు పొందాలని అన్నారు. ఈ యొక్క కంపెనీ చిన్న సన్నకారు రైతుల అభివృద్ధికి పండించిన పంటలకు ప్రోత్సాహాలు అందించి వారిని అభివృద్ధి పరచాలని అన్నారు ఈ కంపెనీకి మన నమ్మకమే మన పెట్టుబడి కావాలని సూచించారు నష్టాలు అధికమించి లాభాలలోకి రావాలని కంపెనీ ప్రొడక్ట్స్ ను స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు

అర్హులైన ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షల జీవిత బీమా





-ఇందిరమ్మ కుటుంబ బీమా నమోదు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలి

-అధికారులకు జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశం

నంగునూరు, నవంబర్ 20(తెలంగాణ పత్రిక):

అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రయోజనాలు అందేలా దరఖాస్తుల నమోదు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, తప్పులు లేకుండా చేపట్టాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ఏ ఒక్క కుటుంబం కూడా పథకం ప్రయోజనాలకు దూరం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. శుక్రవారం నంగునూరు మండలం పాలమాకుల రైతు వేదికతో పాటు, కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామాల్లో జరుగుతున్న నమోదు తీరును, అర్హులైన కుటుంబాల వివరాల సేకరణను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత, భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. దేశంలోనే వినూత్నమైన ఈ పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. గురువారం సిద్దిపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారని గుర్తుచేశారు. పథకం అమలులో భాగంగా దరఖాస్తుల నమోదు సమయంలో లబ్ధిదారుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు తదితర కీలక వివరాలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని స్పష్టం చేశారు. వివరాల నమోదు విషయంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, అర్హులైన కుటుంబాలన్నింటినీ గుర్తించి పథకం పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు పట్టని రైతుల కష్టం

-చందాలతో చెక్‌డ్యామ్ మరమ్మతులు!

-ఏడాది గడిచినా స్పందించని పాలకులు, అధికారులు

-సాగునీటి కోసం రైతులే కూలీలుగా మారిన దుస్థితి

-లక్షల రూపాయలు పోగుచేసి యంత్రాలతో పనులు

-ప్రభుత్వ నిర్లక్ష్యంపై రైతుల తీవ్ర ఆగ్రహం!

ఓదెల, నవంబరు 20 (తెలంగాణ పత్రిక)

రైతుల కష్టాలు పాలకులకు కనిపించడం లేదా? సాగునీటి కోసం అన్నదాతలు పడుతున్న ఆవేదన అధికారుల చెవికి చేరడం లేదా? ఏడాది కాలంగా చెక్‌డ్యామ్ ధ్వంసమై నీరు నిల్వ ఉండక పంటలు ఎండిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. చివరకు ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూసి విసిగిపోయిన రైతులే చందాలు వేసుకుని చెక్‌డ్యామ్ మరమ్మతులకు నడుం బిగించారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా గుంపుల మానేరు వాగులో ఈ దుస్థితి కనిపిస్తోంది. గత ఏడాది నవంబరు 21న గుర్తుతెలియని వ్యక్తులు గుంపుల చెక్‌డ్యామ్‌ను ధ్వంసం చేశారు. దీంతో ఓదెల, జమ్మికుంట, కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మీర్జం పేట, కిష్టంపేట తదితర గ్రామాల రైతులకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. చెక్‌డ్యామ్ దెబ్బతినడంతో మానేరు వాగులో ప్రవహించే నీరు నిల్వ ఉండకుండా వృథాగా పోతోంది. ఫలితంగా వందలాది ఎకరాల సాగుపై ప్రభావం పడుతోంది. అయినా సంబంధిత శాఖ అధికారులు కనీస మరమ్మతులు చేపట్టకపోవడం రైతుల్లో తీవ్ర అసహనానికి కారణమైంది.





ప్రభుత్వం చేయాల్సిన పనిని రైతులే చేస్తున్నారు!

ఏడాది గడుస్తున్నా చెక్‌డ్యామ్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయని పాలకుల తీరుపై రైతులు మండిపడుతున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా స్పందన లేకపోవడంతో ఇక ప్రభుత్వంపై ఆశలు వదులుకున్నారు. సాగునీరు ఉంటేనే పంటలు పండుతాయని, చుక్క నీరు కూడా వృథా కాకుండా నిల్వ చేసుకోవాలనే ఉద్దేశంతో రైతులే ఏకమయ్యారు. లక్షలాది రూపాయలు చందాల రూపంలో పోగుచేసి యంత్రాలను రంగంలోకి దించి మరమ్మతు పనులు చేపట్టారు. ప్రస్తుతం చెక్‌డ్యామ్ వద్ద పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

అన్నదాతలే దిక్కయ్యారు.. పాలకులు ఏం చేస్తున్నారు?

ఒకవైపు రైతుల ఆదాయం పెంచుతామని, సాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని ప్రకటనలు చేసే పాలకులు క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలను ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ పరిధిలో చేపట్టాల్సిన పనులకు రైతులు సొంత డబ్బులు వెచ్చించాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్నినో ప్రభావంతో వర్షాలు, నీటి లభ్యతపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో మానేరు నీటిని నిల్వ చేసుకోవడం అత్యవసరమని చెబుతున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించాలి!

రైతుల చందాలతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టడం అభినందనీయమే అయినా, చెక్‌డ్యామ్‌కు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని రైతులు స్పష్టం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అన్నదాతలే చందాలు వేసుకుని సాగునీటి కోసం పోరాడాల్సిన దుస్థితి రావడం పాలకుల పనితీరుకు అద్దం పడుతోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాలకు నిలయంగా నీరుకుల్ల వంతెన రహదారి!

-కంకర, ఇసుక తొలగించి ప్రమాదాలు నివారించాలి

-అధికారులు వెంటనే స్పందించాలి: దామెర మొగిలి

ఆత్మకూరు, నవంబర్ 20 (తెలంగాణ పత్రిక):





ఆత్మకూరు నుంచి నీరుకుల్ల వంతెన మీదుగా పత్తిపాకకు వెళ్లే రహదారిపై కంకర, ఇసుక పేరుకుపోయి ప్రమాదకరంగా మారిందని దళిత బహుజన శ్రామిక విముక్తి హనుమకొండ జిల్లా కార్యదర్శి దామెర మొగిలి ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ వెంకటేశ్వర రాయి క్రషర్‌కు చెందిన లారీలు, టిప్పర్ల రాకపోకల కారణంగా వంతెన సమీపంలో రోడ్డుపై కంకర, ఇసుక పేరుకుపోయి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే పలువురు గాయపడినా సంబంధిత అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. వెంటనే అధికారులు రోడ్డుపై పేరుకుపోయిన కంకర, ఇసుకను తొలగించాలని, క్రషర్ యాజమాన్యాన్ని హెచ్చరించి రహదారిపై కంకర, ఇసుక పడకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణనష్టం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన కూలీ రైతు వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ పిట్టల రాజమౌళి, జిల్లా నాయకులు ముక్కెర సదానందం, కాడబోయిన మొగిలి, బాపట్ల యుగేందర్, తాళ్లపల్లి స్వామి, దొంకదువ్వ రాజయ్య, జన్ను అనిల్, శనిగరపు భిక్షపతి, ఈర్ల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవ పోటీల్లో జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ.

-ఉపన్యాస పోటీలో ప్రథమ, ద్వితీయ బహుమతులు కైవసం.



జగిత్యాల పట్టణం,తెలంగాణ పత్రిక, నవంబర్ 20.

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. గ్రంథాలయంలో విలువలు, బాధ్యతలు అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీలో కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ వక్తృత్వ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ పోటీలో బీఏ చివరి సంవత్సరం చదువుతున్న ఎ. జ్యోతిశ్రీ ప్రథమ బహుమతి సాధించగా, బీఏ మొదటి సంవత్సరం విద్యార్థిని సీహెచ్ మధుశ్రీ ద్వితీయ బహుమతి కైవసం చేసుకుంది.విద్యార్థులు సాధించిన విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.అలాగే కళాశాల గ్రంథాలయ ఇన్‌చార్జి మల్లికార్జున్, ప్రిన్సిపాల్ బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రమోద్ కుమార్, డాక్టర్ చంద్రయ్య, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి సంగీతారాణి, డాక్టర్ జమున, రామకృష్ణతో పాటు అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రతి ఒక్కరు ఇందిరమ్మ జీవిత బీమాను చేసుకోవాలి

-ముధోల్ ఎంపీడీవో లవ కుమార్



ముధోల్:20నవంబర్(తెలంగాణ పత్రిక)

ప్రతి ఒక్కరు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాను చేసుకోవాలని ముధోల్ ఎంపీడీవో లవకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని బోరిగాం గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో భాగంగా సర్పంచ్ కల్లెడ కిష్టయ్య చేతులు మీదుగా బీమా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ..18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు ఉండి, కుటుంబంలో సంపాదించే వ్యక్తి పేరిట బీమా చేయడం జరుగుతుందన్నారు.బీమా పొందిన వ్యక్తి మరణిస్తే.. నామినీ లేదా కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మజ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



కల్వకుర్తి నవంబర్. 20 తెలంగాణ పత్రిక

కల్వకుర్తి నియోజకవర్గం తలకొండపల్లి మండలంలోని చంద్రధన గ్రామానికి చెందిన శెట్టి సక్కు బాయి ఈరోజు ఉదయం మృతి చెందారు రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ నాయకులు తెలంగాణమాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీజెడ్పిటిసి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఉప్పల వెంకటేష్ తన ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా బాధిత కుటుంబానికి సహాయం అందజేశారు. ఇట్టి విషయాన్ని చంద్రదన లిగ్రామ సర్పంచ్ సొల్లు రంగమ్మ సుధాకర్ ఉప్పల వెంకటేష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వారి కుటుంబానికి 3000 రూపాయాలు తన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేశారు అలాగే ఉప సర్పంచ్ రవీందర్ రెడ్డి 2000 కలిపి మొత్తం 5000రూపాయలు వారి కుటుంబానికి అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సొల్లు రంగమ్మ సుధాకర్ ఉప సర్పంచ్ ఎన్నేడ్ల రవీందర్ రెడ్డి,వార్డు సభ్యులు వడ్డే బాలరాజ్,ఈటామోని అజయ్ యాదవ్,బేగరి అలివేలు చెన్నయ్య, భారతమ్మ సత్తయ్య,మాజీ సర్పంచ్ లు బేగరి రాములు,గంజి శ్రీనివాసులు, మాజీ బి ఆర్ ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మొక్తాల జంగయ్య గౌడ్,కటికల శేఖర్ యాదవ్,మాజీ యాదవ సంఘం అధ్యక్షులు నిదురం యాదయ్య,రాఘవచారి,ఆవుల బాలకిష్టయ్య, నిదురం యాదయ్య, కటికేం పురుషోత్తం,పాలాది నవీన్ తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA
TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా బిజినెస్

నేత్రదాత ఎల్లయ్య సేవలు చిరస్మరణీయం



ఓదెల, నవంబరు 20: (తెలంగాణ పత్రిక)

నేత్రదానం చేసి మరణానంతరం కూడా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన నేత్రదాత గడిగొప్పుల ఎల్లయ్యకు ఓదెల మండల కేంద్రంలో నేత్రదాత స్వగృహంలో ఘనంగా సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన నేత్రదానం సేవలను పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, సతీష్ మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్ పాల్గొని నేత్రదాత ఎల్లయ్య కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. వారి చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు జ్ఞాపికను అందజేశారు. మరణానంతరం కూడా ఇతరులకు చూపును ప్రసాదించేలా నేత్రదానం చేయడం గొప్ప మానవతా సేవ అని పేర్కొన్నారు. నేత్రదానం పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెరగాలని, ఎల్లయ్య చేసిన సేవలు అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు కార్యక్రమంలో సదా ఆశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి ఓదెల ప్రతినిధులు డాక్టర్ వేణు ఖ్యాతం మల్లేష్ అల్లం సతీష్ మెరుగు సారంగం. క్యాతం వెంకటేశ్వర్లు నేత్రదాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆరు తడి పంటలు సాగు చేయాలి

--పంచాయతీ అధికారి యాదయ్య

మెదక్ జిల్లా చిన్నశంకరంపేట తెలంగాణ పత్రిక నవంబర్ 20



ఎల్ ని వో తీవ్రత దృష్టిలో పెట్టుకొని రైతులు పంటలు సాగు చేయాలని పంచాయతీ అధికారి యాదయ్య అన్నారు శుక్రవారం మండల పరిధి గజగట్లపల్లి లో సర్పంచ్ బండారు నాగభూషణం అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించగా, పంచాయతీ అధికారి యాదయ్య పాల్గొని మాట్లాడుతూ వర్ష బావ పరిస్థితిలో సాగునీరు విద్యుత్ సరఫరా లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు రైతులు వారికి బదులుగా తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యే పొద్దుతిరుగుడు కుసుమ జొన్న శనగ వేరుశనగ వేసర మినుములు ఆయిల్ ఫామ్ పంటలను సాగు చేయాలని సూచించారు కూరగాయలు సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు రైతులు పంట పొలాల వద్ద పాంపండ్ తవ్వుకోలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్ ఎంపీ వినోద్ కుమార్, పంచాయతీ సెక్రెటరీ సంతోష్ తోపాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రస్మా ఆధ్వర్యంలో.... ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు

-ప్రైవేట్ పాఠశాలల ఛాంపియన్స్ మీట్ 20 26

పాలకుర్తి నవంబర్ 20(తెలంగాణ పత్రిక):



విద్యతో పాటు క్రీడలు, శారీరక దృఢత్వం, మానసిక వికాసం, నాయకత్వ లక్షణాలు క్రమశిక్షణ ప్రతి విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమనే లక్ష్యంతో తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జనగామ జిల్లా స్థాయి ఛాంపియన్స్ మీట్ -- 2026 క్రీడా పోటీలు నవంబర్ 27, 28, 29 తేదీలలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ క్రీడా సంబరాలకు వనపర్తిలోని పివిఆర్ పాఠశాల వేదిక కానుంది. ఈ పోటీలలో ప్రధానంగా కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, అథ్లెటిక్స్, చెస్ వంటి విభిన్న క్రీడాంశాలను నిర్వహించనున్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు, తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకునేందుకు, ఇతర పాఠశాలల విద్యార్థులతో స్నేహపూర్వక వాతావరణం లో పోటీపడేందుకు ఇది ఒక గొప్ప వేదికగా నిలవనుంది. విద్యార్థుల సర్వతోముఖా భివృద్ధికి క్రీడలు ఎంతో అవసరం. సమయపాలన, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, పట్టుదల వంటి జీవితానికి అవసరమైన విలువలను క్రీడలు నేర్పిస్తాయి. చదువుతో పాటు ఆటలకు కూడా సమాన ప్రాధాన్యత కల్పించినప్పుడే విద్యార్థులు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని సాధించగలరు. ఈ నేపథ్యంలో జనగామ జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ విద్యార్థులను పెద్ద సంఖ్యలో ఈ పోటీలకు పంపించి ప్రోత్సహించాలని ట్రస్మా జిల్లా నాయకత్వం విజ్ఞప్తి చేస్తోంది.ప్రతి విద్యార్థిలోనూ ఒక విజేత దాగి ఉంటాడు. ఆ ప్రతిభకు సరైన వేదిక, ప్రోత్సాహం, అవకాశాలు కల్పించడమే ఈ ఇచ్చాంపియన్స్ మీట్ ముఖ్య లక్ష్యం.ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాపాక విజయ్, కోశాధికారి, ఉపేందర్ రెడ్డి, సీనియర్ మరియు రాష్ట్ర నాయకులు ఇ. ప్రభాకర్ రెడ్డి, సి. ఉపేందర్ రెడ్డి, జనగామ డివిజన్ అధ్యక్షులు నిమ్మ రామ్ రెడ్డి, ఘన్‌పూర్ డివిజన్ అధ్యక్షులు మల్లేశం నాయకత్వం వహిస్తున్నారు.మూడు రోజుల క్రీడా మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ట్రస్మా జిల్లా కమిటీ ఆకాంక్షిస్తోంది.

నిర్వాసితుల పునరావాసానికి 80 ఎకరాల కేటాయింపు మా పోరాట ఫలితమే!

-తెలంగాణ రక్షణసేన ఒత్తిడితోనే ప్రభుత్వం స్పందించింది

-వెంటనే పునరావాస చర్యలు చేపట్టాలి

-సీఎం రేవంత్ రెడ్డి, హరీశ్‌రావు మధ్య రాజకీయ డ్రామా నడుస్తోంది

- తెలంగాణ రక్షణ సేన సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు లోక రవిచంద్ర

నంగునూరు, నవంబరు 20(తెలంగాణ పత్రిక):



మల్లన్నసాగర్, కొండ పోచమ్మసాగర్ రిజర్వాయర్ల నిర్మాణంతో నిరాశ్రయులైన నిర్వాసితుల పునరావాసం కోసం సిద్ధిపేట సమీపంలో 80 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం తెలంగాణ రక్షణసేన పోరాట విజయమని ఆ పార్టీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు లోక రవిచంద్ర పేర్కొన్నారు. నిర్వాసితుల సమస్యపై తమ అధినేత్రి కల్వకుంట్ల కవిత నిరంతరం ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, పార్టీ తరపున సాగించిన పోరాటం ఫలితంగానే ప్రభుత్వం స్పందించిందని ఆయన తెలిపారు. ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగినందున ఇకనైనా కాలయాపన చేయకుండా బాధితులకు వెంటనే పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో.. .గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్ధిపేట జిల్లాలో రిజర్వాయర్లు, కాల్వల నిర్మాణం కోసం వేలాది మంది ప్రజలు తమ నివాసాలను కోల్పోయి నిరాశ్రయులయ్యారని విమర్శించారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ల నిర్మాణం పేరుతో ముంపు గ్రామాల ప్రజలను బలవంతంగా ఖాళీ చేయించారని ఆరోపించారు. సరైన పరిహారం అందకముందే పోలీసులను, అసాంఘిక శక్తులను ఉపయోగించి బాధితులను గ్రామాల నుంచి వెళ్లగొట్టారని ఆరోపించారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ సైతం నిర్వాసితుల పక్షాన ధర్నాలు, దీక్షలు నిర్వహించిందని గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మరోవైపు అందరికీ పునరావాసం కల్పించామని గొప్పలు చెప్పుకున్న బీఆర్ఎస్ నేతలు ప్రస్తుతం ఈ సమస్యపై మౌనం వహిస్తున్నారని మండిపడ్డారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ రక్షణసేన నిరంతరం పోరాటం సాగిస్తోందని తెలిపారు. ఇటీవల టీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణ భూమిపూజ సందర్భంగా తమ అధినేత్రి కవిత నిర్వాసితుల సమస్యను ప్రధానంగా ప్రస్తావించారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేట పర్యటనకు వచ్చేలోపు నిర్వాసితుల పునరావాసంపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను వెల్లడించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే సిద్ధిపేట సమీపంలో 80 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఈ స్థల కేటాయింపు తమ పోరాటానికి దక్కిన విజయమని స్పష్టం చేశారు. సిద్ధిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సభపై లోక రవిచంద్ర తీవ్ర విమర్శలు చేశారు. సీఎం ఏర్పాటు చేసిన సభ ఆయనకు, మాజీ మంత్రి హరీశ్‌రావుకు మధ్య సాగుతున్న రాజకీయ డ్రామాగా కనిపించిందని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలోనైనా, బహిరంగ సభల్లోనైనా ముఖ్యమంత్రి హరీశ్‌రావుపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నప్పటికీ, వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకునే విషయంలో మాత్రం ముందడుగు వేయడం లేదని విమర్శించారు. హరీశ్‌రావు, ఆయన అనుచరులపై భూకబ్జాలు, అక్రమాలు, అరాచకాల ఆరోపణలు చేస్తున్న ముఖ్యమంత్రి వాటిపై చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. సీఎం, హరీశ్‌రావు మధ్య లోపాయికారి అవగాహన ఉందేమోనన్న సందేహం ప్రజల్లో కలుగుతోందని వ్యాఖ్యానించారు. రాజకీయ కుస్తీ పడుతున్నట్లు బయటకు కనిపిస్తున్నా, అంతర్గతంగా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. సిద్ధిపేటలో ముఖ్యమంత్రి ప్రసంగం రాజకీయ విమర్శలు, ఆరోపణలకే పరిమితమైందని తెలిపారు. హరీశ్‌రావు బాధితులకు భరోసా కల్పించేలా లేదని అన్నారు. సిద్ధిపేటలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను అడ్డుకోవడంతో పాటు బాధితులకు అండగా నిలిచి న్యాయం జరిగే వరకు తెలంగాణ రక్షణసేన పోరాటం కొనసాగిస్తుందని లోక రవిచంద్ర స్పష్టం చేశారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో ఆర్థిక భరోసా



-18 నుంచి 59 ఏళ్ల వయసు ఉన్న వారు అర్హులు

-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

-వేములవాడలోని 4వ వార్డులో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

-పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ

వేములవాడ, నవంబర్,20, తెలంగాణ పత్రిక.



ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి, ఆపద సమయంలో అండగా నిలవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తున్నదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ పట్టణంలోని 4వ వార్డులో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా శుక్రవారం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బీమా పథకం పోస్టర్లు, కరపత్రాలను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా రూ.ఐదు లక్షల జీవిత బీమా అందించడమే ఈ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కోటి ఐదు లక్షలకు పైగా కుటుంబాలకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించే బృహత్తర కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. భూమి, ఆస్తులు లేని కుటుంబాలకు సైతం జీవిత బీమా భరోసా కల్పించాలనే గొప్ప ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని తీసుకొచ్చారని పేర్కొన్నారు. 18 నుంచి 59 ఏళ్ల వయసు కలిగిన వారు ఈ పథకంలో నమోదు చేసుకోవాలని, కుటుంబంలో ఎవరిని ప్రధాన సభ్యుడిగా ఎంపిక చేసుకోవాలో వారే నిర్ణయించుకోవచ్చని సూచించారు.జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నంబర్ తో హెల్ప్ డెస్క్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. రేషన్ కార్డు లేని అర్హులైన కుటుంబాలను సైతం గుర్తించి పథకంలో భాగస్వాములను చేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు.ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ?10 లక్షల వరకు వైద్య సహాయం, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తూ పేదలకు అండగా నిలుస్తోందని వివరించారు. రైతులకు ?20,650 కోట్లకు పైగా రుణమాఫీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ లాంటి పథకాలు ప్రజా ప్రభుత్వ సంక్షేమ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి ?ఐదు లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు.బీసీలకు సామాజిక, రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో తగిన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కులగణన చేపట్టి దేశానికి రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు సైతం మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.వేములవాడ పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, నాలుగో వార్డులో ప్రజలు కోరిన అభివృద్ధి పనులను పూర్తి చేస్తూ ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. జమ్మిగద్దె వద్ద దసరా వేడుకలు ఘనంగా నిర్వహించుకునేలా విశాలమైన సీసీ నిర్మాణం చేపట్టామని తెలిపారు. ప్రజల సంక్షేమం, పట్టణ అభివృద్ధి రెండు లక్ష్యాలుగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు.భక్తుల నమ్మకాలు, విశ్వాసాలకు అనుగుణంగా..రాజన్న ఆలయ, విస్తరణ అభివృద్ధి పనులు శృంగేరి పీఠాధిపతి సూచనలు, ఆగమ శాస్త్రం, వేద పండితుల సూచనల ప్రకారం ..భక్తుల నమ్మకాలు, విశ్వాసాలకు అనుగుణంగా పనులు చేయిస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఎవరి సొంత నిర్ణయాలు లేవని స్పష్టం చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా రూ. 250 కోట్లతో ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. ఆలయ విశిష్టత, ఖ్యాతి కి అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. భక్తులు దుష్ప్రచారం నమ్మవద్దని కోరారు. ఆలయ అభివృద్ధి, విస్తరణ లక్ష్యంగా పనులు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు ఇందిరమ్మ పెన్షన్ మంజూరు పత్రాలు పంపిణీ చేశామని తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేట జిల్లాలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభించారని గుర్తు చేశారు. కుటుంబ పెద్ద ఏమైనా కారణంతో చనిపోతే వారి కుటుంబానికి రూ. 5 లక్షల బీమా అందుతుందని, కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు.రాష్ట్రానికి చెందిన అన్ని కుటుంబాల వారు తమ పరిధిలోని ప్రత్యేక నమోదు కేంద్రాల వద్ద రేషన్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలు ఇవ్వాలని సూచించారు. డిసెంబర్ 19వ తేదీ వరకు శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బీమా ఎవరి పేరిట ఉండాలి.. నామినీ ఎవరు ఉండాలో నిర్ణయం తీసుకోవాలని, నామినీ ఒక్కరు లేదా ఎందరు అయినా పెట్టుకోవచ్చని తెలిపారు. 18 నుంచి 59 ఏండ్ల వయసు వారు అర్హులని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఫోన్ కు మెసేజ్ వస్తుందని వివరించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ఆర్డీవో కే ఎస్ బీ కుమారి, నోడల్ అధికారి,డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా ప్రణాళిక అధికారి సంపత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ లోకేష్, మెప్మా ఏపీ మీర్జా ఫసహత్ అలీ బేగ్, ఈడీఎం శ్రీనివాస్, వార్డు సభ్యులు తోట రాజు, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణతోనే బంగారు భవిష్యత్తు

-విద్యార్థులకు విద్య, భద్రత, సమానత్వం పై అవగాహన

దమ్మపేట, నవంబర్ 20: తెలంగాణ పత్రిక





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల కేంద్రంలోని పీఎం శ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలబాలికల విద్య, హక్కులు, రక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల హక్కుల ప్రాధాన్యత, విద్య ఆవశ్యకత, వ్యక్తిగత భద్రత, సమానత్వం తదితర అంశాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ప్రతి బాలుడికీ విద్య హక్కు ప్రతి బాలబాలికకు నాణ్యమైన విద్యను పొందే హక్కు ఉందని, విద్య ద్వారానే వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ ప్రగతి సాధ్యమవుతుందని ఉపాధ్యాయులు వివరించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహాల నివారణ, బాలలపై వేధింపుల అరికట్టడం, మంచి స్పర్శ--చెడు స్పర్శను గుర్తించడం, వ్యక్తిగత భద్రత వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలకు తెలియజేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో అప్రమత్తత ప్రస్తుత కాలంలో సెల్ ఫోన్లు, అంతర్జాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్ మోసాలు, వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని, సాంకేతిక పరిజ్ఞానాన్ని చదువుకు ఉపయోగపడే విధంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాలబాలికలకు సమాన అవకాశాలు బాలబాలికల మధ్య ఎలాంటి వివక్ష ఉండకూడదని, అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో విద్య, క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. పరిశుభ్రత, పోషకాహారం, క్రమశిక్షణ, మంచి అలవాట్లతో ఆరోగ్యవంతమైన జీవితాన్ని అలవరచుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన హక్కులతో పాటు బాధ్యతలను కూడా తెలుసుకోవాలని, ఇతరుల హక్కులను గౌరవిస్తూ సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టీ. ఉషారాణి, ఉపాధ్యాయులు రాంబాబు, భాస్కరాచారి, కొండలరావు, సురేష్, కృష్ణారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో చైతన్యం, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని వారు తెలిపారు.

ప్రతి పనికి గడువు విధించి.. వేగంగా పూర్తి చేయాలి

-వీటీఏడీఏ వైస్ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

-రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి, బద్ది పోచమ్మ, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

వేములవాడ, నవంబర్, 20, తెలంగాణ పత్రిక.



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో ప్రతి దానికి గడువు విధించి.. వేగంగా పూర్తి చేయాలని వీటీఏడీఏ వైస్ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వేములవాడ పట్టణంలో వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులపై వీటీఏడీఏ వైస్ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి శుక్రవారం ఆర్ అండ్ బీ, దేవాదాయ శాఖ, ఎన్ పీ డీ సీ ఎల్, వేములవాడ మున్సిపల్ అధికారులతో ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా ప్రతి పనికి సంబంధించి ప్రత్యేకంగా కూలీల సంఖ్య పెంచాలని, పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ అధికారులు నిత్యం అభివృద్ధి పనులను పరిశీలిస్తూ.. వేగంగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. రాజన్న ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనుల్లో మిగతావి ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో దేవాదాయ శాఖ ధార్మిక సలహాదారు గోవింద హరి, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కే అత్యంత కీలకం

-యువతలో ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కుపై అవగాహన పెంచాలి

-విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి, నవంబర్ 20 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కామారెడ్డి జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బహుమతులు, షీల్డులు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని అన్నారు. ప్రజలు తమ ఓటు ద్వారా ఎన్నుకునే ప్రజాప్రతినిధులే విధానాల రూపకల్పనలో ప్రధాన పాత్ర పోషిస్తారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఎన్నికల సమయంలో తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో, యువతలో ఓటింగ్ శాతాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థులు ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించి, అర్హత పొందిన వెంటనే ఓటరుగా నమోదు చేసుకుని, బాధ్యతాయుతమైన ఓటర్లుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, సరైన ప్రజాప్రతినిధుల ఎన్నికలో ప్రతి ఓటూ కీలకమని అన్నారు. విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించడంలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు ఎన్నికల నిర్వహణ విధానం, ఓటు వేసే ప్రక్రియ, వీవీప్యాట్ వినియోగం, దాని ప్రాముఖ్యత తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు అధికారులు వివరించారు. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో నిర్వహించిన క్విజ్, వ్యాసరచన తదితర పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి, వివిధ పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా





నిజాంసాగర్ (తెలంగాణ పత్రిక) నవంబర్ 20

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు కార్యక్రమం గురువారం కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం సుల్తాన్ నగర్ గ్రామంలో ప్రారంభమైంది. జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు, కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ జీవిత బీమా భరోసాను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి తహసీల్దార్, కుటుంబరావు, ఎంపీడీఓ, శివకృష్ణ ఎంఈఓ, తిరుపతి రెడ్డి ఏపీఎం, ప్రసన్నరాణి, సెక్రటరీ భీమ్రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రజా పండరి, గ్రామ సర్పంచ్ బ్రహ్మం, బ్యాతయ్య, హుస్సేన్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి



కల్వకుర్తి నవంబర్ 20 తెలంగాణ పత్రిక

కల్వకుర్తి నియోజవర్గం తలకొండపల్లి మండలం లివై జి ఎన్ ఆర్ ఫంక్షన్ హాల్ లో వెల్జాల్ గ్రామ వాస్తవ్యులు ఇంజమూరి కళమ్మ శ్రీనివాసులు దంపతుల ఆహ్వానం మేరకు వారి కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులు ప్రణవి, ప్రశాంత్ లను అక్షింతలు వేసి ఆశీర్వదించిన కల్వకుర్తి శాసనసభ్యులు క సిరెడ్డి నారాయణరెడ్డి ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నరసింహ, ఆమనగల్ పిఎసిఎస్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ రెడ్డి, వెల్జాల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఉప సర్పంచ్ అజీజ్ నాయకులు ఆరిఫ్ , షాబుద్దీన్,సురేష్, చింటూ,తదితరులు పాల్గొన్నారు..

ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్యకి 101వ జన్మదిన శుభాకాంక్షలు

-శాలువాతో సత్కరించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



పాలకుర్తి నవంబర్ 20(తెలంగాణ పత్రిక):

చుక్కా రామయ్య 101 వ జన్మదినం సందర్భంగా హైదరాబాద్, విద్యానగర్ లోని చుక్కా రామయ్య నివాసానికి వెళ్లి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి ఎర్రబెల్లి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎందరో విద్యార్థులు ఐఐటీ పూర్తి చేసి ప్రపంచ దేశాల్లో స్థిరపడడానికి కారణం చుక్కా రామయ్య అని కొనియాడారు. విద్యా ప్రదాత కాకుండా తెలంగాణ పోరాటంలో, రాజకీయాల్లో దిక్సూచిగా తన పాత్ర పోషించాడని ఆయన అన్నారు. అలాంటి చుక్కా రామయ్య 101వ పుట్టిన రోజు జరుపుకోవడం మనందరికీ ఎంతో స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు..

జూపల్లిలో ఘనంగా శ్రీ చెన్నకేశవ స్వామి పునఃప్రతిష్ట మహోత్సవం



కల్వకుర్తి నవంబర్. 20 తెలంగాణ పత్రిక



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి పునఃప్రతిష్ట మహోత్సవం జూపల్లి గ్రామంలో ఘనంగా జరిగింది. ఆహ్వాన పత్రిక మేరకు ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఈ పునఃప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు కౌన్సిలర్ లిశ్రీ పాపిశెట్టి రామన్న గ్రామ సర్పంచ్ జగపతి సీనియర్ నాయకులు బొజ్జయ్య పాల్గొని, స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారితో పాటు రామన్న మిత్రమండలి సభ్యులు శ్రీను నాయక్, భాస్కర్, రాకేష్, గ్రామస్తులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి వారి ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు భక్తి శ్రద్ధలతో పాల్గొని, స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారి కృపా కటాక్షాలు మనందరిపై ఉండాలని కోరుకున్నారు.

లింగరాజుపల్లిలో శ్రీ కంఠ మహేశ్వర స్వామి ఆలయానికి విద్యుత్ వెలుగులు

-భక్తుల సౌకర్యార్థం విద్యుత్ స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటు



తెలంగాణ పత్రిక వలిగొండ మండలం నవంబర్ 20.

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని లింగరాజుపల్లి గ్రామంలో గత 40 సంవత్సరాలుగా గౌడ కులస్తుల ఆరాధ్య దైవంగా విరాజిల్లుతున్న శ్రీ కంఠ మహేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఆలయం గ్రామానికి కొంత దూరంలో ఉండటంతో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించిన గ్రామ సర్పంచ్ బోడిగె లింగస్వామి అధికారుల సహకారంతో పీర్ల కొట్టం నుంచి కాటామయ్య గుడి వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించి, వైరింగ్‌తో పాటు వీధి దీపాల ఏర్పాటు కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో ఆలయానికి వెళ్లే భక్తులకు రాత్రి వేళల్లో ఇబ్బందులు తొలగనున్నాయి. ప్రజాప్రతినిధుల చొరవతో ఆలయ మార్గంలో వెలుగులు నిండటంపై గ్రామస్తులు, గౌడ కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు గౌడ కులస్తులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా కేకే మహేందర్ రెడ్డి



గంభీరావుపేట తెలంగాణ పత్రిక నవంబర్ 20

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన అక్కపెల్లి రాజు మంజుల తనయురాలు వర్షశ్రీ పుట్టినప్పటి నుండి అంగవైకల్యం తోటి బాధపడుతున్న విషయాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులకు విన్నవించగా వారు వెంటనే సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించిన మహేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్ తో ఇట్టి సమస్యను చేరవేసి అంగవైకల్యం తోటి బాధపడుతున్న వర్ష శ్రీ మనోధైర్యాన్ని కల్పించే దిశగా ప్రభుత్వం ద్వారా అందించే ఎలక్ట్రానిక్ వీల్చేరు దీని విలువ సుమారు 1,20,000 ఒక లక్ష ఇరవై వేల వరకు ఉన్నటువంటి దానిని లబ్ధిదారురాలైన వర్షశీ కి స్థానిక సర్పంచ్ మల్లుగారి పద్మ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హమీద్ ప్యాక్స్ చైర్మన్ వేశాల వెంకట్ డైరెక్టర్ పెద్దవేని రాజ మల్లయ్య స్థానిక వార్డు సభ్యురాలు గొల్ల సుశాంతిక నిశాంత్ 10వ వార్డు సభ్యురాలు అక్క పెల్లి లతా బాలయ్య చేతుల మీదుగా వారికి అందించారు ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అడగగానే తమ కూతురికి ఎలక్ట్రానిక్ వీల్చైర్స్ అందించడానికి కృషి చేసిన కేకే మహేందర్ రెడ్డి జిల్లా కలెక్టర్ స్థానిక కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆరుతడి పంటలు సాగు చేయాలి



రెబ్బెన, నవంబర్ 20 (తెలంగాణ పత్రిక):

వర్షా బావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వచ్చే రబి సీజన్లో రైతులు వరి సాగుకు బదులు తక్కువ నీటి అవసరమున్న ఆరుతడి పంటలను తమ భూములలో సాగు చేసుకోవాలని రెబ్బెన మండల వ్యవసాయ అధికారి దిలీప్ కుమార్ సూచించారు శుక్రవారం మండలంలోని కొండపల్లి, ఎడవెల్లి గ్రామాలలో అభి సీజన్లో సాగు చేసే పంటలపై రైతులకు అవగాహన కల్పించారు ఎల్ నినో ప్రభావం వల్ల వర్షా బావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులు తమ భూముల్లో మొక్కజొన్న పెసర శనిగా వంటి నీటి అవసరం తక్కువగా ఉన్న పంటలు పండించాలని సూచించారు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పంటలకు సోకే చీడపీడల నుండి పంటలను కాపాడుకోవాలని అన్నారు రైతులకు సబ్సిడీపై విత్తనాలు వ్యవసాయ పరికరాలు ప్రభుత్వం అందిస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి కృపారాణి రైతులు పాల్గొన్నారు

డిసెంబర్ 14న ఢిల్లీలో జరిగే బీసీ జనభేరి సభ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

-ఎన్ఎస్పీ అతిథి గృహశీలో బీసీ నాయకులతో కలిసి విడుదల చేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ ప్రతినిధి//నవంబర్ 20:(తెలంగాణ పత్రిక):-



జనవరి 10వ తేదీ నుండి దేశవ్యాప్తంగా చేపట్టనున్న జాతి జనగణనలో ఓబీసీ కాలమ్ పెట్టాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 14న ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో బీసీల జనభేరి సభను నిర్వహిస్తున్నామని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. జనభేరికి సంబంధించిన గోడ పత్రికలను స్థానిక ఎన్ఎస్పీ అతిథి గృహంలో స్థానిక బీసీ నేతలతో కలిసి ఆవిష్కరించిన అనంతరం లింగంగౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీసీ కులాల లెక్కలు తీయకుండా బీసీల హక్కులను కాలరాస్తుందని ఓబీసీ ప్రధాని ఉన్న ఓబీసీలకు న్యాయం జరగడం లేదన్నారు.జాతీయ జనగణనలో ఓబీసీ కాలమ్ చేర్చాలని గత ఆరు నెలలుగా దేశవ్యాప్తంగా ఉన్న కోట్ల మంది బీసీలు కేంద్రానికి మొరపెట్టుకుంటున్న కేంద్ర ప్రభుత్వంలో కనీస చలనం రాకపోవడం సిగ్గుచేటన్నారు. ఓబీసీలకు న్యాయం చేయని బిజెపిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని వచ్చే ఎన్నికల్లో రాజకీయంగా బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఓబీసీ కాలం చేర్చి బీసీ కులాల లెక్కలు చట్టబద్ధంగా సేకరించాలని లేనిపక్షంలో భవిష్యత్తులో బీసీల ఆగ్రహానికి బిజెపి గురీగాక తప్పదని జాజుల హెచ్చరించారు. బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్ బీసీ జేఏసీ మిర్యాలగూడ పట్టణ కన్వీనర్, యర్రబెల్లి దుర్గయ్య రజక బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు,ఉరిబండి శ్రీనివాస్ యాదవ్, బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి,బంటు కవిత బీసీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి,సందేనబోయిన జయమ్మ బీసీ మహిళా సంఘం మిర్యాలగూడ నియోజకవర్గం అధ్యక్షురాలు, నక్క నాగరాజ్ బీసీ విద్యార్థి సంఘం పట్టణ కార్యదర్శి, బీసీ యువజన మరియు జిల్లా పట్టణ నాయకులు ఎస్ పి నాయుడుబంటు సైదులు ముదిరాజ్, పొలాగని శంకర్ గౌడ్, నకిలాపూరి యాదగిరి రజక, తాడూరి సైదులు రజక, రాచురి రాములు రజక,మచ్చ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు

-ప్రభుత్వ ఉద్యోగ సాధనకు గ్రంథాలయాలే వేదిక

-రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

కామారెడ్డి ,నవంబర్ 20, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో నవంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఖాళీల భర్తీకి క్రమం తప్పకుండా ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తోందని, ఇప్పటికే పలు నోటిఫికేషన్ల ద్వారా ఖాళీలను భర్తీ చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యం ఉన్న ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకొని పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని అన్నారు. యువత డిజిటల్ వినోదానికి దూరంగా ఉండి, ఆ సమయాన్ని చదువుకు కేటాయించాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో, ప్రతి మండలంలో గ్రంథాలయాలు ఎంతో ముఖ్యమైనవని, విద్యార్థుల భవిష్యత్తుకు అవి కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి గ్రంథాలయ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ చురుకుగా పనిచేస్తున్నారని కలెక్టర్ అభినందించారు. గ్రంథాలయంలో స్థల కొరతను అధిగమించి అదనపు మౌలిక వసతులు కల్పించేందుకు జిల్లా కలెక్టర్ నిధుల నుంచి రూ.12 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం గ్రంథాలయానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు వస్తున్నారని, 24 గంటల పాటు గ్రంథాలయ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నందున అదనపు మౌలిక వసతుల



అవసరం ఉందని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం కింద కూడా గ్రంథాలయాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను పరిశీలిస్తామని తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని, గ్రూప్-1, గ్రూప్-2 వంటి పోటీ పరీక్షల్లో విజయం సాధించి సమాజానికి సేవ చేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. గ్రంథాలయ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సమర్పిస్తే తప్పకుండా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి, అదనపు కలెక్టర్ గిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ చౌదరి లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమపై ప్రజాభిప్రాయ సేకరణ

-సోహమ్ అగ్రో ఇండస్ట్రీస్‌తో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

-విర్లపాలెం గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలి

-ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ ప్రతినిధి//నవంబర్ 20:(తెలంగాణ పత్రిక):-



నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం విర్లపాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సోహమ్ అగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి సంబంధించి నిర్వహించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ పాల్గొని తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక యువతకు ఉద్యోగాలలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని,గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కంపెనీ యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల ఏర్పాటు వల్ల స్థానిక ప్రజలకు మేలు జరగాలి అని వారు అన్నారు. పరిశ్రమల ఏర్పాటు కేవలం కంపెనీల అభివృద్ధికే పరిమితం కాకుండా, ఆ ప్రాంత ప్రజల జీవితాల్లో కూడా మార్పు తీసుకురావాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, పరిశ్రమ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే ఎన్నో కుటుం బాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. స్థానిక యువతకు ఉద్యోగ నియామకాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. సోహమ్ అగ్రో ఇండస్ట్రీస్ యాజమాన్యం ఉద్యోగ నియామకాల సమయంలో విర్లపాలెం గ్రామంతో పాటు దామరచర్ల మండలం, అడవిదేవులపల్లి మండల పరిధిలోని నిరుద్యోగ యువతకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. యువత విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు, అర్హత లను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచి ంచారు. స్థానిక యువతకు అవసరమైన శిక్షణ అం దించి పరిశ్ర మలో పనిచేసేలా ప్రోత్సహించాలని అన్నారు.

విర్లపాలెం గ్రామ అభివృద్ధికి కంపెనీ సహకరించాలి:

పరిశ్రమ ఏర్పాటు వల్ల గ్రామాల అభివృద్ధి పై కంపెనీ యాజమన్యం ప్రత్యేక దృష్టి సారించాలి పరిశ్రమ ఏర్పాటు వల్ల ప్రభావితమయ్యే గ్రామాల అభివృద్ధిపై కంపెనీ యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం, పారిశుధ్యం వంటి మౌలిక సదుపా యాల కల్పనకు సహకరించాలని కోరారు. స్థానిక ప్రజల సంక్షేమం కోసం సామాజిక బాధ్యతతో కంపెనీ ముందుకు రావాలని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలి: పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం స్థానిక ప్రజల సమస్యలు, అభిప్రాయాలు, అవసరాలు తెలియజేసేం దుకు కీలకమైన వేదిక అని అన్నారు. ప్రజలు వెల్లడించే అభిప్రాయాలను కంపెనీ యాజమాన్యం, సంబంధిత అధికారులు



గౌరవించి, పర్యావరణ పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమ వల్ల స్థానిక ప్రాంతానికి ఆర్థికంగా మేలు జరగడంతో పాటు యువతకు ఉపా ధి, గ్రామాలకు అభివృద్ధి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందుబాటులోకి రావాలని ఎమ్మెల్సీ ఆకాంక్షించారు. పరిశ్రమ అభివృద్ధి చెందాలి.. అ దే సమయంలో స్థానిక ప్రజల ప్రయోజనాలు, యువత భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధా న్యత ఉండాలి అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, ప్రజాప్ర తినిధులు, సంబంధిత అధికారులు, కంపెనీ ప్రతిని ధులు తదితరులు పాల్గొన్నారు.

తులసికి వివాహం ఎందుకు జరుపుతారు దాని గల కారణాలు

-కవి,లెక్చరర్ ఉమాశేషారావు వైద్య

కామారెడ్డి, నవంబర్ 20 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)





తులసి ఎక్కడ ఉంటే లక్ష్మి అక్కడ నివాసం ఉంటుందని పురాణాలు చెపుతున్నాయి కార్తీకమాసం శుక్లపక్షం నాడు ద్వాదశి తిథి రోజు మహావి ష్ణ వు శాలిగ్రామతో వివాహం చే సుకుంటాడని పురాణాల్లో పే ర్కొనబడింది.21/11/2026 ఉదయం 6.45 నిమిషాలకు ద్వాదశి వచ్చి సాయంత్రం 4.45 నిమిషాల వరకు క్షిరాబ్ది ద్వాదశి ఉంటుంది. పురాణా ల ప్రకారం ఆషాడ మాసం లో నే శుక్ర పక్షంలోని దేవశయ ని ఏకాదశి రోజున మహావిష్ణ వు నాలుగు నెలల పాటు యో గ నిద్రలో ఉంటాడు. కార్తీకమా సంలోని దేవత్తుని ఏకాదశి రో జున మళ్లీ మేలుకోలోకి వస్తా డు. ఆ మరుసటి రోజు తుల సిని తన సాలిగ్రామ ఆకారం లో వివాహం చేసుకు ంటాడు. తులసిని మోక్షదాయనిగా,మో క్షానికి వారధి గా కూడా పేర్కొం టారు. వాస్తు దోష నివారణ లో కూడా తులసి ముఖ్య మై న పాత్రనుపోషిస్తుంది. తులసి చెట్టుకు ఉసిరి చెట్టుతో వివా హం చేస్తారు. ఉసిరిని విష్ణ రూపంలో చూస్తారు. తులసి వివాహానికి గల కారణంమనం గమనిస్తే పూర్వ కాలంలో జలం ధరుడు అనే రాక్షసుడు ఉండే వాడు. శివుడు మూడో కన్ను నుండి ఉద్భవించిన వాడే ఈ ఈ జలంధరుడు. ఇతనిని వృందగా పిలిచే అంద గత్తె వివాహం చేసుకుంటుంది. ఈమె అంత్యత విష్ణుభ క్తురా లు.నిత్యం విష్ణ వును ఆరాధి స్తుంది. దీంతో ఆ రాక్షసుడికి మరింత శక్తి వచ్చి దేవతలను ఎదిరిం చాలనుకుంటాడు.వారి తోనిత్యం ఘర్షణపడి హింసి స్తాడు. దీని తో దేవతలందరూ విష్ణును వేడుకుం టారు. ఈ క్రమంలో విష్ణువు అప్రయత్నం గానే బృం దను తాకుతాడు, దానితో ఆమె మదనపడి తన పవి త్రతకు భంగం కలిగిందని మనో వేదనతో విష్ణువును శాపి స్తుంది. తర్వాత బృందా భర్త కూడా తన శక్తు లన్నింటినీ కో ల్పోతాడు. అప్పుడు విష్ణువు జల ంధరున్ని సంహరిస్తాడు. విష్ణ సతి ప్రాధే యపడ డంతో ఆమె శాపాన్నిఉపసంహరించు కుంటుంది. గండికా నది వద్ద శాలిగ్రామ రూపంలో విష్ణువు ఉంటాడు ఆమె పవిత్ర భక్తికి మె చ్చి శిలా రూపంలో తులసి ని వివాహం చేసుకుంటారు. తులసి మండపాన్ని ఏర్పాటు చేసి బాగా అలంకరించిచుట్టూ పూ లతో అలంకరించి దీపాలు వెలిగించి, ఎర్రని చీర చుట్టూ కట్టి దానిలోసాలిగ్రామవిగ్రహం లేదా తులసి చెట్టుకు ఉసిరి కొమ్మను కట్టి వివాహం జరు పుతారు. ఆరోగ్య రీత్యా కూడా అనేక ఔషధాల్లో తులసిని విని యోగిస్తాం 24 గంటలు ఆక్సిజ న్ ను అందించే తులసి మొక్క ను హిందూ ధర్మం ప్రకారం ప్ర తి ఇంటిలో పెంచుతారు. విష్ణ తులసి, కృష్ణ తులసి అని రెం డు రకా లుగా కూడా ఉంటా యి. అనేక చర్మ వ్యాధు లకు జలుబు దగ్గు వంటి వ్యా ధుల కు కూడా ఉప శమనంగా పని చేస్తుంది. మన దేశంలోని ప్రతి ఆచారం వెనుక సైన్స్ మిళిత మైఉంటుంది.కొం దరు కార్తీక పౌర్ణమి రోజు కూ డా తులసి గద్దె అలంకరించి చెరుకు గ డలతో చుట్టూ కట్టి పుష్పా లంకృతలను చేసి కొ బ్బరి కా య కొట్టి తన భక్తి భావాలను చాటుకుంటారు.వివాహం కానీ స్త్రీలు ఈ వివాహంలో పాల్గొంటే పెళ్లిజరుగుతుంది అని భక్తుల నమ్మకం.

కలెక్టర్ ప్రతిమా సింగ్ చేతుల మీదుగా సూరారంసర్పంచ్ చిలుక నాగరాజు కు సన్మానం





మెదక్ జిల్లాచిన్నశంకరంపేట తెలంగాణ పత్రిక నవంబర్ 20

ప్రపంచ బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామంలో నిర్వహించిన బాల గ్రామసభ సర్పంచ్ చిలక నాగరాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ గ్రామ సభలో బాలల హక్కులు, చదువు, రక్షణ, ఆట – పాటలపై బాలలు తమ అభిప్రాయాలను ధైర్యంగా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంతో చక్కగా నిర్వహించినందుకు సూరారం గ్రామ సర్పంచ్ చిలుక నాగరాజు ను మెదక్ జిల్లా ఉత్తమ సర్పంచ్ గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి హేమ బిందు చేతుల మీదుగా సన్మానం పొంది జిల్లా స్థాయి గౌరవం పొందారు.గ్రామాభివృద్ధి బాలల సంక్షేమం, పాఠశాలల అభివృద్ధి కోసం సర్పంచ్ చిలుక నాగరాజు చేస్తున్న కృషికి ఈ గౌరవం దక్కిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కొండగట్టు అంజన్న ఎల్ నివో ను ఎదుర్కొనే శక్తిని ఇవ్వండి







-రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ వేడుకోలు

-ప్రభుత్వ సూచనలు ప్రజలు తప్పకుండ పాటించాలి

-కొండగట్టు అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతాం

-కొండగట్టు అంజన్న ను దర్శించుకున్న మంత్రి అడ్లూరి ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం కవ్వంపల్లి సత్యనారాయణ

జగిత్యాల, నవంబర్ 20 (తెలంగాణ పత్రిక):

జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సందర్శించి దర్శించుకున్నారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ ఎల్ నినోను ఎదుర్కొనే శక్తిని ప్రజా ప్రభుత్వానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అందించాలని కొండగట్టులోని ఆంజనేయ స్వామిని వేడుకున్నట్టు రాష్ట్ర స్పీకర్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ నర్సింగరావు జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి కొండగట్టు ఆంజనేయ స్వామిని స్పీకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారు లు ఆలయ అర్చకులు స్పీకర్ తో పాటు మంత్రి లక్ష్మణ్ కుమార్ కు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రపం చానికి సవాలుగా మారిన ఎల్ నినోను సమర్థ వంతంగా ఎదుర్కొనే శక్తిని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రజా ప్రభుత్వానికి అందించాలని కొండగట్టు ఆంజనేయ స్వామిని కోరుకున్నట్లు స్పీకర్ తెలిపారు. 60 ఏళ్లకు ఒకసారి జరిగే చందనోత్స వములో పాల్గొనడం అదృష్టమని స్పీకర్ అన్నారు. ఆంజనేయ స్వామి నిజరూప దర్శనం అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ను గాడిలో పెడుతున్న ముఖ్యమంత్రి కి కొండంత ధైర్యాన్ని ఆంజనేయ స్వామి ప్రసాదించాలని కోరుకున్నట్లు స్పీకర్ తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో వస్తున్న కరువును గుర్తించిన ప్రభుత్వం చేస్తున్న సూచనలను ప్రజలు తప్పకుండ పాటించాలని ఈ సందర్భంగా కోరారు. కొండగట్టు ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి తో మాట్లాడి ప్రత్యేక నిధులు సాధిస్తామని తెలిపారు.

నిజరూప దర్శనం అదృష్టం:

మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతు కొండగట్టులో స్వయంభుగా వెలసిన ఆంజనేయ స్వామి చందనోత్స వములో పాల్గొనడం స్వామి వారి నిజరూప దర్శనం చేసుకోవడం గత జన్మలో చేసుకున్న పుణ్యంగా భావిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి అడ్లూరి తెలిపారు. మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ ఆలయాల విశిష్టతను భవిష్యత్ తరాలకు అందించాలనే లక్ష్య ంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర నుండి భద్రా చలం వరకు కోట్ల రూపాయలు వెచ్చించి ఆలయా లను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్పీకర్ గడ్డం ప్రసాద్ సహకారంతో కొండగట్టు ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు సాధిస్తామని మంత్రి తెలిపారు.

40 వ వార్డులో 18 మందికి చేయూత ప్రొసీడింగ్ లను అందజేసిన అడువాల జ్యోతిలక్ష్మణ్



జగిత్యాల, నవంబరు 20 (తెలంగాణ పత్రిక):

జగిత్యాల నిరుపేదలు వృద్ధులు వితంతువులు దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు 40 వార్డ్ కౌన్సిలర్ అడువాల జ్యోతి లక్ష్మణ్ తెలిపారు. పట్టణంలోని 40వ వార్డుకు చెందిన 18 మందికి నూతనంగా చేయూత పెన్షన్లు మంజూరు కావడంతో శుక్రవారం తన నివాసంలో లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యతని సమాజంలోని పేద బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా తన వంతు కృషి నిరంతరం కొనసాగిస్తానని పేర్కొన్నారు. తన నివాసంలో పెన్షన్ మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ జడ్పిటిసి తిరుమల్ గౌడ్



కామారెడ్డి,నవంబర్ 20, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం చెందిన మామిండ్ల బాలమణి – పెద్ద రాజ్యానర్స్ కుమారుడు శ్రావణ్ కుమార్ – అరుణ ల వివాహము ఆరేపల్లి కళ్యాణ మండపంలో జరిగింది. ఈ వివాహానికి మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ముత్యంపేట సర్పంచ్ ఆశ బోయిన అక్షర, దోమకొండ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆశ బోయిన శ్రీనివాస్, శివరాం మందిర్ ఆలయ చైర్మన్ కొండ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేత



కామారెడ్డి, నవంబర్ 20 , (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో శుక్రవారం రోజున ఇందిరమ్మ గృహ ప్రవేశానికి హాజరై లబ్ధిదారులు నిమ్మ ఎల్లవ్వ- గంగయ్య దంపతులకు నూతన వస్త్రాలను మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్ సర్పంచ్ ఐరెని నరసయ్యలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, సహకారంతో దోమకొండ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో దోమకొండ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సీతారాశీ మధు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు నర్సింలు, చేయూత సహకార సంఘం అధ్యక్షుడు బత్తిని సిద్ధరాములు మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్ , మర్రి శేఖర్, మాజీ కోఆప్షన్ సభ్యులు షమ్మీ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు, బీమా పథకాలపై చర్చ



నిజాంసాగర్ ، నవంబర్ 20

నిజాంసాగర్ ఐకేపీ మండల సమాఖ్య (స్త్రీశక్తి భవనం)లో నవంబర్ మాసపు కార్యవర్గ సమావేశం మండల సమాఖ్య అధ్యక్షురాలు నందాస్ కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో నెలవారీ ఆర్థిక లావాదేవీలు, అర్హత కలిగిన సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాల మంజూరు, రుణాల రికవరీ, గ్రామ సంఘాల పనితీరుపై చర్చించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అవగాహన కల్పించారు. ఈ నెల 26వ తేదీ నుంచి ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం కానున్నట్లు తెలిపారు. చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ఏపీఎం వి. ప్రసన్న రాణి గ్రామ సంఘాల ప్రతినిధులకు సూచించారు. ఈ సమావేశంలో ఏపీఎం, సీసీలు, మండల సమాఖ్య సిబ్బంది, గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా నమోదు చేసుకోవాలి

-ఎంపీడీవో రాజేందర్

గంభీరావుపేట తెలంగాణ పత్రిక నవంబర్ 20



రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరా వుపేట మండలం నర్మాల గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ కుటు ంబ జీవిత బీమా నమోదు కార్య క్రమాన్ని సర్పంచ్ రాజబోయిన అర్చన ఎంపీడీవో రాజేందర్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇందిర మ్మ కుటుంబ జీవిత బీమా నమోదు చేసుకోవాలని తెలిపారు 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు ఉండి కుటుంబంలో సంపాదించే వ్యక్తి పేరిట బీమా చేయడం జరుగుతుందన్నారు భీమా పొందిన వ్యక్తి మరణిస్తే నామినీ లేదా కుటుంబానికి 5 లక్షల పరిహారం అందించడం జరుగుతుందని ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈకార్య క్రమంలో నర్మాల గ్రామ సర్పంచ్ రాజబోయిన అర్చన ఎంపీడీవో రాజేందర్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నిమ్మల తిరుపతి గౌడ్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రాగుల మహేందర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ రాజబోయిన నాగయ్య చాత్రబోయిన మల్లయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల రవీందర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు నార్మల గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA
TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా బిజినెస్

దళితులను వేధించడం మానుకోవాలి

-టీఆర్ఎస్ నాయకుడు బోర్గి సంజీవ్ హెచ్చరిక



నిజాంసాగర్ (తెలంగాణ పత్రిక) నవంబర్ 20

దళితులను వేధించడం మానుకోవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును టీఆర్ఎస్ దళిత విభాగం జిల్లా అధ్యక్షుడు బోర్గి సంజీవ్ డిమాండ్ చేశారు. నిజాంసాగర్ మండలం గోర్గల్ గ్రామంలో పర్యటించిన ఆయన 2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిన దళితుల పట్టా భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ.. 20 ఏళ్ల క్రితం పంపిణీ చేసిన పట్టా భూములపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. ఫారెస్ట్, రెవెన్యూ శాఖల ద్వారా నోటీసులు ఇప్పిస్తూ పేద రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కనపెట్టి నిరుపేదల భూములపై విచారణల పేరుతో వేధింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. టీఆర్ఎస్ పార్టీ బాధిత దళితులకు అండగా ఉంటుందని, ఎమ్మెల్యే తన వైఖరిని మార్చుకొని దళితుల పక్షాన నిలవాలని సూచించారు. లేనిపక్షంలో ప్రజల నుంచి రాజకీయంగా వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

తెలంగాణ ఉద్యమకారులు దరఖాస్తులు చేసుకోండి

-తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సలహాదారు దాస్ ఎల్లం

కామారెడ్డి ,నవంబర్ 20 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



15 సంవత్సరాల క్రితం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమాలలో పాల్గొన్న నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందుటకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో చేపడుతున్న సభ్యత్వ నమోదులో నాలుగు రోజుల్లోగా తమ దరఖాస్తులను చేసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల పోర రాష్ట్ర సలహాదారు దాస్ ఎల్లం సూచించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని పోరాడిన ఉద్యమకారులకు తమ ప్రభుత్వం పెన్షన్ 250 గజాల ప్లాటు గుర్తింపు కార్డు అందజేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజే హామీ ఇచ్చారని అందులో భాగంగానే ముఖ్యమంత్రి చెప్పిన అంశాలనే సాధించుటకు తమ పోరం ముందుకు వెళుతుందని ఈ సందర్భంలో పార్టీలకతీతంగా ఉద్యమంలో పాల్గొని తెలంగాణ కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులు కేసులు ఉన్నవారు బైండవరైన వారు తమ తమ వివరాలతో నాలుగు రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఇండ్లు నూతన పింఛన్దారులకు మంజూరి పత్రాలు అందజేత

జగిత్యాల, నవంబర్ 20 (తెలంగాణ పత్రిక):



జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామంలో 5 వ విడత సామాజిక తనిఖీలో భాగంగా గ్రామ సభను సర్పంచ్ కట్ట రాజేందర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఉపాధి హామీ పనినీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు నూతన పింఛన్దారులకు మంజూరి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిటింగ్ టీం ఏపీఎం ఉప సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామ కార్యదర్శి ఫీల్డ్ అసిస్టెంట్ ఆశ వర్కర్స్ అంగన్వాడి టీచర్స్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా భరోసా

-అర్హులందరూ ఇందిరమ్మ బీమా చేసుకోవాలి: మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్



తానూర్:20నవంబర్(తెలంగాణ పత్రిక)

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తానూర్ ఎంపీడీవో శ్రీధర్ సూచించారు. శుక్రవారం మండలంలోని కోలూర్ గ్రామంలో సర్పంచ్ మాధవరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు బీమా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న కుటుంబంలో సంపాదించే వ్యక్తి పేరిట బీమా కల్పిస్తున్నట్లు తెలిపారు. బీమా పొందిన వ్యక్తి మరణిస్తే నామినీకి లేదా కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల వరిహారం అందుతుందని వివరించారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆర్థికంగా అండగా నిలిచేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో మహేందర్ నాథ్, పంచాయతీ కార్యదర్శి దత్త రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు ధర్మేందర్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల మున్సిపల్ పరిధిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు ప్రారంభం

-అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

-మున్సిపల్ చైర్‌పర్సన్ సమింద్ల వాణి

జగిత్యాల, నవంబర్ 20 (తెలంగాణ పత్రిక):





జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు ప్రక్రియ 27, 28, వాణినగర్ లో 13 లింగంపేటలో 14 గాంధీనగర్ వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ సమింద్ల వాణి శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ ప్రారంభించారు. జగిత్యాల పురపాలక సంఘ పరిధిలో మొదటి విడతగా ఈరోజు 27, 28, 13, 14, 4, 10, 23, 35, 39 వార్డుల్లో నమోదు ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక కార్యక్రమాలు చేపడుతూ అభివృద్ధి సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు మేలు చేసే పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు ఎంతో ఉపయోగకరమైన పథకమని తెలిపారు. ఒక కుటుంబంలో ఇంటి పెద్దను కోల్పోతే ఆ కుటుంబం ఎదుర్కొనే ఆర్థిక ఇబ్బందులు మనందరికీ తెలిసిన విషయమేనని అలాంటి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని పేర్కొన్నారు. 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో రూ.5 లక్షల జీవిత బీమా అందించే ఈ పథకం పేద కుటుంబాలకు గొప్ప ఆసరాగా నిలుస్తుందని అన్నారు. గత అక్టోబర్ నెలలో జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో సుమారు 170 మంది మరణాలు నమోదయ్యాయని పేర్కొంటూ ప్రతి నెలా ఇలాంటి మరణాల కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా సామాజికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. కుటుంబానికి అండగా నిలిచే వ్యక్తిని కోల్పోయిన సమయంలో ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా ఎంతో అవసరమని ఆ బాధను ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం ఎంతో గొప్ప కార్యక్రమమని తెలిపారు. అర్హత కలిగిన కుటుంబం ఈ పథకానికి అర్హులని జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో సుమారు 31 వేల మంది ఈ పథకానికి అర్హులుగా ఉన్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో నమోదు చేసుకోవాలని కోరారు. వితంతువులు గీత కార్మికులు తదితర అర్హులకు పెన్షన్లు అందిస్తూ సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన ప్రోత్సాహం సహకారం అందిస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్ మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రాధాన్యతను వివరిస్తు కుటుంబంలో ఆర్థికంగా ఆధారమైన వ్యక్తి ప్రమాదవశాత్తు లేదా సహజ మరణం ద్వారా మరణించిన సందర్భంలో ఆ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక భరోసా అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో ఈ పథకం నమోదు కార్యక్రమాన్ని మొదటి విడతగా 27, 28, 13, 14, 4, 10, 23, 35, 39 వార్డులలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఫోటో గుర్తింపు కార్డు లేదా రేషన్ కార్డుతో నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు అనంతరం దరఖాస్తుదారులకు రిజిస్ట్రేషన్ రసీదు వారి మొబైల్ నంబర్‌కు అందజేయబడుతుందని తెలిపారు. మున్సిపల్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి నమోదు ప్రక్రియను సజావుగా నిర్వహిస్తారని ప్రజలు సిబ్బందికి సహకరించి ఈ పథకంలో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జుంబర్తి గంగలక్ష్మిరాజ్ కుమార్ బైర్నీని భాగ్య సిరికొండ వరలక్ష్మి బొల్లరపు స్వప్నగిరిధర్ దయాల చంద్రకళ శంకర్ అరవలక్ష్మి దుమాల రాజ్ కుమార్ ఖాజా కమలుద్దీన్ మున్సిపల్ మేనేజర్ సుష్మా మున్సిపల్ సిబ్బంది ఆర్పిలు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి



-పాలమాకుల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి

నంగునూరు, నవంబర్ 20(తెలంగాణ పత్రిక):





రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, కొనుగోలు ప్రక్రియను, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యంలో తేమ శాతం నిబంధనలకు అనుగుణంగా ఉన్న వెంటనే కొనుగోలు చేసి లోడ్ చేయాలని సూచించారు. మిల్లర్ల వైపు నుంచి ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ధాన్యం తూకంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, సుత్తిలు, తూకం యంత్రాలు, తాగునీరు తదితర అవసరమైన సౌకర్యాలను అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. రైతులు ధాన్యం విక్రయించేందుకు కేంద్రాలకు వచ్చినప్పుడు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసేలా కేంద్ర సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం సన్న ధాన్యానికి అందిస్తున్న బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, కొనుగోలు కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూచికల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముందంజ

-రాష్ట్ర కమిషనర్ ప్రశంసలు.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక నవంబర్ 20

గురువారం 20-11-2026న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ నిర్వహించిన జూమ్ సమావేశంలో రాష్ట్రంలోని 33 జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఆరోగ్య సూచికల పురోగతిని సమీక్షించగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐ ఎఫ్ ఏపంపిణీ, హెచ్ పి వి వ్యాక్సినేషన్ సికిల్ సెల్ ఇండికేటర్లలో మాత్రమే కొంత వెనుకబడి ఉన్నట్లు గుర్తించడం జరిగింది. ఈ మూడు అంశాల్లో నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర కమిషనర్ సూచించారు. మిగిలిన అన్ని ఆరోగ్య సూచికల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముందంజలో ఉండటంపై రాష్ట్ర కమిషనర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన సూచికల్లో కూడా 100 శాతం లక్ష్యాలను సాధించాలని సూచించారు. అదేవిధంగా ఇకపై ప్రతి నెలలో రెండుసార్లు జూమ్ సమావేశాలు నిర్వహించి ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ సమావేశంలో బియ్యండ హెచ్ ఓ డాక్టర్ తుకారామ్ రాథోడ్ ,అడిషనల్ డిఎండ హెచ్ ఓ డాక్టర్ సైదులు డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ భద్రాచలం డాక్టర్ శ్రీధర్, డిప్యూటీ డి ఎం డ హెచ్ ఓ కొత్తగూడెం డాక్టర్ ప్రతాప్ , ఎన్సిడిప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ దినేష్, టీబి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, ఎంహెచ్ఎన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్, ఎఎయం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాందాస్, ఏరియా ఆసుపత్రి భద్రాచలం డాక్టర్ రాధాకృష్ణ, ఏవో డాక్టర్ హరీష్ డిప్యూటీ డిఇ ఎంఓ నాగలక్ష్మి, ఎస్ ఓ నవీన్, టి -హబ్ కోఆర్డినేటర్ నిజాముద్దీన్, 102 కోఆర్డినేటర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా

-ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

-డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్

కామారెడ్డి,నవంబర్ 20,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం నిజాంసాగర్ మండలం సుల్తాన్ నగర్ గ్రామంలో జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ కుటుంబరావు, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, ఏపీఎం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రజా పండరి, గ్రామ సర్పంచ్, గ్రామ అధ్యక్షులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణతోనే బంగారు భవిష్యత్తుకు పునాది







-జిల్లా సంక్షేమ అధికారిణి కే.ఎం.తార.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక నవంబర్ 20

బాలలే దేశ భవిష్యత్తుకు నిజమైన సంపద అని, ప్రతి బాలబాలికకు సురక్షితమైన బాల్యం, నాణ్యమైన విద్య, మెరుగైన ఆరోగ్యం, సమాన అవకాశాలు కల్పించిన ప్పుడే అభివృద్ధి చెందిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి కే.ఎం.తార పేర్కొన్నారు. అంతరా తీయ బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక చుంచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహి ంచిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ బాలల హక్కుల పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములై బాలల సమగ్ర అభివృద్ధికి కృషి చేయా లని పిలుపునిచ్చారు. బాలలకు ప్రేమ, ఆప్యాయత, భద్రతతో కూడిన వాతావరణాన్ని కల్పించడంతో పాటు వారి అభిప్రాయాలకు గౌరవం ఇవ్వడం, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ఎంతో అవసరమని తెలిపారు.బాలలందరికీ విద్య అందుబా టులో ఉండాలని, పేదరికం, సామాజిక అసమా నతలు, ఇతర కారణాల వల్ల ఏ ఒక్క బాలుడు కూడా విద్యకు దూరం కాకూడదని పేర్కొన్నారు. బాలల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం, పరిశుభ్రత, వైద్య సేవలు, మానసిక ఆరోగ్య పరిరక్షణ ఎంతో కీలకమని వివరించారు. ముఖ్యంగా బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు, హింస, నిర్లక్ష్యం, బాలల అక్రమ రవాణా వంటి సామాజిక దురాచారాలను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బాలలపై ఎక్కడైనా హక్కుల ఉల్లంఘన జరిగినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి వారికి తగిన రక్షణ, న్యాయం అందేలా చూడాలని కోరారు. ఈ కార్య క్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి కే. ఎం. తార, జిల్లాల బాలల సంరక్షణ అధికారి హరి కుమారి మహిళా సాధికారత సిబ్బంది సౌజన్య, షీటీం ఎస్ఐ రమాదేవి, డిసిపియు సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ప్రజా ప్రభుత్వం.. షాద్‌నగర్ మార్కెట్‌కు మహర్దశ

-రూ. 3.40 కోట్లతో 40 నూతన కూరగాయల దుకాణాలు ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

-సంచి వసూళ్లకు చెక్.. అవినీతి రహిత పాలనతో మార్కెట్ అభివృద్ధి

-రుణమాఫీ, రైతు భరోసాతో పాటు త్వరలో 'ఇందిరమ్మ జీవిత బీమా'ఎమ్మెల్యే వెల్లడి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 20(తెలంగాణ పత్రిక)



రైతుల శ్రమకు తగిన గుర్తింపునిస్తూ, వ్యాపారులకు ఆధునిక మౌలిక వసతులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా,షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్ యార్డులో రూ. 3.40 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 40 దుకాణాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో మాదిరిగా సంచికి వసూళ్లు చేస్తూ రైతుల శ్రమను దోచుకునే దళారీ వ్యవస్థకు చరమగీతం పాడామన్నారు. ప్రస్తుతం నూతన పాలకవర్గం అవినీతికి తావులేకుండా అత్యంత పారదర్శకంగా పనిచేస్తోందని అభినందించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో షాద్‌నగర్ మార్కెట్ ఆదర్శంగా నిలిచిందని, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మార్కెట్ మరింత అభివృద్ధి చెందుతోందని తెలిపారు.

అప్పుల ఊబిలోంచి ఆర్థిక ప్రగతి వైపు..

రైతు బిడ్డ అయిన సీఎం రేవంత్ రెడ్డి అన్నదాతల కష్టాలను స్వయంగా ఎరిగిన వారని, అందుకే రూ. 2 లక్షల రుణమాఫీని అమలు చేశామని శంకర్ అన్నారు. అర్హులైన అసలైన రైతులకే రైతు భరోసా అందజేస్తామని, పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కోసం త్వరలోనే 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకాన్ని తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు. గత పదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తమైందని, సర్పంచులు, కాంట్రాక్టర్ల బిల్లులతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు. అయినప్పటికీ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తున్నామని స్పష్టం చేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎ. సులోచన కృష్ణారెడ్డి, బి. వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి, వైస్ చైర్మన్ తుపాకుల శేఖర్ ముదిరాజ్, గిరిజన విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ రఘునాయక్, డైరెక్టర్ కరుణాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిశాలోని ఎన్టీపీసీ కనిహా థర్మల్ పవర్ ప్లాంట్‌కు నైనీ బొగ్గు

-బొగ్గు సరఫరాకు సింగరేణి సంసిద్ధం.

-ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్‌తో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి భేటీ.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక నవంబర్ 20





ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి తెలంగాణ రాష్ట్రానికి సరఫరా చేయగా మిగిలిన బొగ్గును స్థానిక పరిశ్రమలతో పాటు ఆ రాష్ట్రంలో ఉన్న ఎన్టీపీసీ కనిహా థర్మల్ విద్యుత్ ప్లాంట్‌కు సరఫరా చేయడానికి సింగరేణి సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఎన్టీపీసీ చైర్మన్ ఎండీ గురుదీప్ సింగ్‌తో సింగరేణి సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్ మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి.. నైనీ బొగ్గు బ్లాక్‌లో జరుగుతున్న ఉత్పత్తి గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు తెలంగాణ రాష్ట్రానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తూ.. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి నైనీ బొగ్గులో అధిక భాగం సరఫరా చేస్తున్నామని తెలిపారు. మిగిలిన బొగ్గును స్థానిక పరిశ్రమలకు సరఫరా చేస్తున్నట్టు వివరించారు. ఎన్టీపీసీతో ఇప్పటికే తమకున్న బొగ్గు సరఫరా ఒప్పందాలకు అనుబంధంగా.. ఒడిశాలోని కనిహా థర్మల్ విద్యుత్ ప్లాంట్ కూడా బొగ్గును అందించడానికి సంసిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. సింగరేణి సంస్థ ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలోని ఎన్టీపీసీ ప్లాంట్లతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల్లోనీ ఆ సంస్థకు చెందిన ప్లాంట్లకు ఒప్పందం ప్రకారం దశాబ్దాల కాలంగా బొగ్గు సరఫరా చేస్తూ వస్తోందని సింగరేణి చైర్మన్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి వివరించారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో తెలంగాణ తర్వాత ఎక్కువ శాతం బొగ్గును ఎన్టీపీసీ ప్లాంట్‌లకే సరఫరా చేస్తోందన్నారు. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ వచ్చే ఏడాది నుంచి సంవత్సరానికి 10 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయనుందని సింగరేణి చైర్మన్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. నాలుగు దశాబ్దాల పాటు ఈ బ్లాక్ నుంచి బొగ్గు ఉత్పత్తి జరగనుందని వివరించారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్టీపీసీ కనిహా థర్మల్ ప్లాంట్‌కు దీర్ఘకాలిక ఒప్పందంతో బొగ్గును అందించటానికి సింగరేణి సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దీనిపై ఎన్టీపీసీ చైర్మన్ మరియు ఎండీ గురుదీప్ సింగ్ సానుకూలంగా స్పందించారు. తమ ప్లాంట్‌కు అవసరమైన బొగ్గును ప్రస్తుతం ఇతర ప్రభుత్వ బొగ్గు సంస్థల ద్వారా స్వీకరిస్తున్నామని, నైనీ బొగ్గు బ్లాకు తమ ప్లాంట్‌కు సమీపంలోనే ఉన్నందున అక్కడి నుంచి కూడా బొగ్గు తీసుకోవడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు.

గద్వాల్ స్మృతి వనంలో టిప్పు సుల్తాన్ జయంతి సందర్భంగా మొక్కలు నాటిన

-భీమ్ ఆర్మీ నాయకులు

(తెలంగాణ పత్రిక)20/11/26జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి

మైసూర్ పులి హజరత్ టిప్పు సుల్తాన్ గారి 276వ జయంతిని పురస్కరించుకొని గద్వాల్ జిల్లా కేంద్రంలోని స్మృతి వనంలో భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు అడ్వకేట్ మధుసూదన్ గారు మరియు అతికూర్ రెహమాన్ పాల్గొనడం జరిగింది ముందుగా టిప్పు సుల్తాన్ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం స్మృతి వనంలో మొక్కలు నాటి, వాటికి నీరు పోశారు. ఈ సందర్భంగా భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షులు మేల్లచెరువు వర్షిత్ మాట్లాడుతూ – "బ్రిటిష్ వాళ్ళకి లొంగకుండా చివరి వరకు పోరాడిన గొప్ప యోధుడు టిప్పు సుల్తాన్. ఆయన స్ఫూర్తితోనే నేడు మేము పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాము. నాటిన ప్రతి మొక్కను కాపాడుకునే బాధ్యత మాదే. టిప్పు సుల్తాన్ లాగే, పర్యావరణాన్ని కాపాడుకోవడం కూడా మనందరి బాధ్యత" అని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమ్ ఆర్మీ నాయకులు ..సుందరాజ్ యం డి జునైద్ ప్రభాకర్ జనార్ధన్ మనోహర్ అరవింద్ బన్నీ తదితరులు పాల్గొనడం జరిగింది

పోతగల్ల పోశమ్మ వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేసిన రామన్న



కల్వకుర్తి నవంబర్. 20 తెలంగాణ పత్రిక

కడ్తాల్ మండలం, కడ్తాల్ లోని పోతగల్ల పోశమ్మ కు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు, ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు ఆమనగల్ కౌన్సిలర్ పాపి శెట్టి రామన్న స్వయంగా పాల్గొని, బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ, పేదలకు, బాధితులకు సేవ చేయడమే తన ధ్యేయమని, ఎవరైనా ఆపదలో ఉంటే తన వంతు సహాయం చేస్తానని తెలిపారు. ఆ కుటుంబ సభ్యులు రామన్నకు ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

కళాభారతిని సందర్శించిన తెలంగాణ ఉద్యమకారులు



కామారెడ్డి, సంబరు 20 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కళాభారతిలో త్వరలో జరగనున్న తెలంగాణ ఉద్యమకారుల సమావేశం కోసం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర సలహాదారు దాస్ ఎల్లం తో పాటు ఫోరం జిల్లా నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కళాభారతిని సందర్శించారు. ఉద్యోగమాకారుల సమావేశానికి జేఏసీ కన్వీనర్ కోదండ రాముతో పాటు పలువురు రాష్ట్ర నాయకులు రానున్నందున ఉద్యమకారులు ఈ సమావేశంలో అధిక సంఖ్యలో పాల్గొని తమ వివరాలు తెలియజేయుటకు ముందుకు రావాలని వారు సూచించారు.

రైతుల సమస్యలపై దృష్టి పెట్టండి

-9 టీఎంసీల నీరున్నా సాగునీరు ఎందుకు ఇవ్వడం లేదు



నిజాంసాగర్ (తెలంగాణ పత్రిక) నవంబర్ 20

రైతుల సమస్యలను పక్కనపెట్టి వ్యక్తిగత రాజకీయ విమర్శలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని మహమ్మద్ నగర్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం గాలిపూర్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండేపై అనవసర విమర్శలు చేయకుండా రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9 టీఎంసీల నీరు అందు బాటులో ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందిం చడంపై స్పష్టత ఇవ్వడం లేదని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావం, విద్యుత్ కొరత పేరుతో పంటలు వేయవద్దని చెప్పడం రైతులను అయోమయానికి గురిచేస్తోందన్నారు. మండలంలోని ఎనిమిది గ్రామపంచాయతీల రైతులకు సాగు నీరు అందిం చాలని డిమాండ్ చేశారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రా లను పూర్తిస్థాయిలో ప్రారంభించక పోవడంతో రైతులు దళారుల చేతుల్లో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. రాజకీయ విమర్శలు మానుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సూచించారు. ఈ సమావేశంలో గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, మాజీ సర్పంచులు రామచందర్, సంగమేశ్వర్ గౌడ్, లక్ష్మారెడ్డి, లక్ష్మీనారాయణ, మహేందర్, బషీర్, సిద్ధ గౌడ్, విట్టా గౌడ్, మహిపాల్, గంగారాం, రాజు తదితరులు పాల్గొన్నారు.

12 శనివారం నవంబర్ 21 2026 కరీంనగర్

తెలంగాణ పత్రిక TELANGANA PATRIKA TELUGU DAILY తెలుగు దిన పత్రిక

GENERAL NEWS

ఇల్లంతకుంటలో ఇందిరమ్మ జీవిత బీమా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

-అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి సర్పంచ్ రాజు



ఇల్లంతకుంట, నవంబర్ 20 తెలంగాణ పత్రిక

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం ఇల్లంతకుంట గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రారంభమైంది. మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఎం.రాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5 లక్షల జీవిత బీమా పథకానికి 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు గల అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. అవసరమైన పత్రాలతో గ్రామపంచాయతీ కార్యాలయం లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా పాలకవర్గం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంతగిరి సాహిత్య–వినయ్ కుమార్, వార్డు సభ్యులు మామిడి శ్రీనివాస్, చేరాల వంశీకృష్ణ, రాకం సుమన్, అంతటి శ్రీకాంత్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, పాక్స్ డైరెక్టర్ ఒగ్గు రమేష్, నాయకులు పసుల వెంకన్న, జమల్, దుర్గయ్య, సతీష్, అంగన్వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మలిదశ తెలంగాణ ఉద్యమకారులపై నమోదైన కేసుల వివరాలు ఇవ్వండి

-డిఎస్పిని కోరిన ఉద్యమ కారులు



కామారెడ్డి, నవంబర్ 20,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లాలోమలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని కేసులు, బైండోవర్ అయిన బాధితులకు వివిధ సంబంధిత పొలిస్టేషన్ లలోని ఎఫ్ఐఆర్కాపీలు, ఉద్యమకారులకు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం కామారెడ్డి డి.ఎస్.పిమధుసుదన్ కి వినతిపత్రం అందజేషిన కార్యక్రమంలో పాల్గొన్న స్టేట్ కో అర్డ్ నెటర్ దాస్ఎల్లం, రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి పిరంగి రాజేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్, శ్యామ్, రాజన్న, ఉద్యమకారులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్స్ ఫోరం రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడిగా అరెకంటి శివప్రసాద్



లితెలంగాణ పత్రిక చారకొండ, నవంబర్ 20:

నాగర్కర్నూల్ జిల్లా చారకొండ మండలం జూపల్లి గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు అరెకంటి శివప్రసాద్ తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్స్ ఫోరం రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి మహేష్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో వార్డు సభ్యుల పాత్ర ఎంతో కీలకమని, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడానికి వార్డు సభ్యులంతా సంఘటితంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.డిజిటల్ మాధ్యమాల ద్వారా వార్డు సభ్యుల సేవలు, సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ఫోరం లక్ష్యాలను మరింత విస్తరిస్తామని తెలిపారు. తనకు అప్పగించిన పదవిని బాధ్యతగా భావిస్తూ వార్డు సభ్యుల హక్కులు, గౌరవాన్ని కాపాడటంతో పాటు గ్రామాల సమగ్ర అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని స్పష్టం చేశారు.అరెకంటి శివప్రసాద్ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడిగా నియమితులు కావడంపై జూపల్లి గ్రామస్థులు, పలువురు వార్డు సభ్యులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

కష్టాల నుంచి న్యాయస్థానం వరకు

-తలారి బాలయ్య విజయ ప్రస్థానం

కామారెడ్డి ,నవంబర్ 20, (తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా బిబిపేట మండలంతుజాల్పూర్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది తలారి బాలయ్యకు అరుదైన గౌరవం నాంపల్లి కోర్టులో స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్గా నియామకం -- పేద కుటుంబం నుంచి న్యాయరంగంలో ఉన్నత స్థాయికి ఎదిగిన స్ఫూర్తిదాయక ప్రయాణం కామారెడ్డి జిల్లా బీబీపేట మండలంలోని తుజాల్పూర్ గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది తలారి బాలయ్యకు (తండ్రి వెంకయ్య) కు అరుదైన గౌరవం లభించింది. ఆయన సుదీర్ఘ న్యాయవాద అనుభవం, న్యాయరంగంలో అందించిన సేవలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్గా నిర్వహించిన బాధ్యతలను గుర్తిస్తూ గౌరవ తెలంగాణ హైకోర్టు మరియు తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్లోని నాంపల్లి కోర్టులో స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్గా నియమించాయి. ఈ నియామకంతో తుజాల్పూర్ గ్రామంతో పాటు కామారెడ్డి జిల్లా ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పేదరికాన్ని అధిగమించి ఉన్నత విద్యను అభ్యసించిన బాలయ్య తలారి బాలయ్య కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం తుజాల్పూర్ గ్రామానికి చెందిన దివంగత తలారి పోచమ్మ, వెంకయ్య దంపతులకు ఐదవ మరియు చివరి సంతానంగా జన్మించారు. ఆయనకు కేవలం ఎనిమిదేళ్ల వయసులోనే తండ్రి అనారోగ్యంతో మరణించడంతో కుటుంబం అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంది. అయినప్పటికీ బాలయ్య చదువుపై ఉన్న ఆసక్తి, పట్టుదల, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలనే సంకల్పంతో విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా వేసవి సెలవులు, పండుగ సెలవుల సమయంలో స్వగ్రామానికి వచ్చి వ్యవసాయ కూలీ పనులు చేస్తూ తన చదువుకు అవసరమైన సహకారం అందించుకున్నారు. కష్టపడి పనిచేస్తూనే విద్యను కొనసాగించడం ఆయన జీవితంలో ప్రత్యేకమైన అంశం. తొమ్మిదో తరగతి వరకు సిద్దిపేటలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటూ విద్యనభ్యసించారు. అనంతరం 1987--88లో బీబీపేట్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశారు. 1989--91లో దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, 1991--95లో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఏ. పూర్తి చేశారు. తన విద్యాభ్యాసాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో ప్రవేశం పొంది 1995--98లో ఎల్.ఎల్.బి. పూర్తి చేశారు. అనంతరం 1999--2001లో లేబర్ లా స్పెషలైజేషన్తో ఎల్.ఎల్.ఎం. పట్టా పొందారు. గ్రామీణ నేపథ్యం, ఆర్థిక ఇబ్బందులు తన లక్ష్యానికి అడ్డంకులు కాకుండా ఉన్నత విద్యను పూర్తి చేయడం ఆయన పట్టుదలకు నిదర్శనం.

1999 నుంచి న్యాయవాదిగా సుదీర్ఘ ప్రస్థానం

తలారి బాలయ్య 1999 ఏప్రిల్ 7న అప్పటి బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. అప్పటి నుంచి న్యాయవాద వృత్తిని కొనసాగిస్తూ వివిధ రకాల సివిల్, క్రిమినల్ మరియు ఇతర న్యాయపరమైన కేసుల్లో వాదనలు వినిపించారు. న్యాయశాస్త్రంపై పట్టు, కేసుల అధ్యయనంలో నిబద్ధత, న్యాయపరమైన అంశాలను లోతుగా విశ్లేషించే సామర్థ్యం, బాధితులకు న్యాయం అందించాలనే తపనతో న్యాయవాద రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. అనేక కేసుల్లో బాధితుల తరఫున వాదిస్తూ వారి హక్కులు, న్యాయపరమైన ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేశారు. క్రమంగా అనుభవజ్ఞుడైన సీనియర్ న్యాయవాదిగా పేరు సంపాదించుకున్నారు.

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్గా విశిష్ట సేవలు

ఆయన న్యాయరంగంలో అందించిన సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం 2018 ఫిబ్రవరి 3న రంగారెడ్డి జిల్లా కోర్టు పరిధిలోని ఎల్.బి. నగర్ కోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్గా నియమించింది. 2018 నుంచి 2022 వరకు పబ్లిక్ ప్రాసిక్యూటర్గా పనిచేసిన కాలంలో ప్రభుత్వ తరఫున అనేక క్రిమినల్ కేసులను సమర్థవంతంగా నిర్వహించారు. ముఖ్యంగా నేర బాధితులకు న్యాయం అందించడం, సాక్ష్యాధారాలను న్యాయస్థానం ముందు సమర్థంగా ప్రవేశపెట్టడం, సాక్షుల వాంగ్మూలాలు మరియు కేసులకు సంబంధించిన న్యాయపరమైన అంశాలను సమన్వయం చేయడం వంటి బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించారు. తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో బాధితుల తరఫున న్యాయం జరిగేలా కృషి చేశారు. ఆయన నిర్వహించిన పలు కేసుల్లో నేరస్థులకు జీవిత ఖైదు వంటి కఠిన శిక్షలు విధించబడటం ఆయన ప్రాసిక్యూషన్ సేవల్లో ముఖ్యమైన అంశంగా నిలిచింది. ప్రాసిక్యూటర్గా ఆయన చూపిన వృత్తిపరమైన నిబద్ధత, బాధ్యతాయుతమైన పనితీరు, పోలీసు మరియు న్యాయశాఖలతో సమన్వయం ప్రశంసలు అందుకున్నాయి.

పోలీసు శాఖ నుంచి అవార్డులు, ప్రశంసా పత్రాలు

పబ్లిక్ ప్రాసిక్యూటర్గా ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా అప్పటి రాచకొండ పోలీస్ కమిషనర్, ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనర్గా ఉన్న మహేష్ భగవత్ గారు, అలాగే అప్పటి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ గార్ల చేతుల మీదుగా పలు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. నేర విచారణ, న్యాయస్థానాల్లో కేసుల నిర్వహణ, బాధితులకు న్యాయం అందించే ప్రక్రియలో తన వృత్తిపరమైన బాధ్యతలను సమర్థంగా నిర్వహించడం ద్వారా పోలీసు మరియు న్యాయశాఖ వర్గాల్లో గుర్తింపు పొందారు.

స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్గా నూతన బాధ్యతలు

దాదాపు 28 సంవత్సరాలకు పైగా న్యాయవాద వృత్తిలో అనుభవం సంపాదించి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్గా కూడా సేవలందించిన తలారి బాలయ్యను గౌరవ తెలంగాణ హైకోర్టు మరియు తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్లోని నాంపల్లి కోర్టులో స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్గా నియమించడం ఆయన వృత్తిపరమైన ప్రయాణంలో



మరో ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. న్యాయవ్యవస్థలో న్యాయం, నిష్పాక్షికత, చట్టబద్ధత, రాజ్యాంగ విలువలు అత్యంత ప్రాధాన్యమైనవి. ఈ కొత్త బాధ్యతల్లో కూడా చట్టానికి అనుగుణంగా, నిష్పాక్షికంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు న్యాయవ్యవస్థపై మరింత విశ్వాసం కలిగించేలా సేవలందిస్తారని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ యువతకు స్ఫూర్తిదాయకమైన జీవితం వ్యవసాయ కూలీ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి, చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయి, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ, కష్టపడి చదువుకొని న్యాయశాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించి, న్యాయవాదిగా, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్గా, ఇప్పుడు స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్గా ఎదగడం తలారి బాలయ్య జీవితంలోని విశేషమైన ప్రయాణం. ఆయన ప్రస్థానం గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తోంది. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా కృషి, పట్టుదల, క్రమశిక్షణ, విద్య పట్ల అంకితభావం ఉంటే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని ఆయన జీవితం నిరూపిస్తోంది.

కృతజ్ఞతలు తెలిపిన తలారి బాలయ్య

తనను స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్గా నియమించినందుకు గౌరవ తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానానికి, తెలంగాణ ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తలారి బాలయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన జీవితంలో ఈ స్థాయికి చేరుకోవడానికి సహకరించిన కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్నేహితులు, న్యాయవాద సహచరులు, న్యాయశాఖ మరియు పోలీసు శాఖ అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా న్యాయవ్యవస్థ పట్ల గౌరవంతో, చట్టబద్ధత , నిష్పాక్షికతకు ప్రాధాన్యమిస్తూ తన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. తుజాల్పూర్ గ్రామం నుంచి నాంపల్లి కోర్టు వరకు సాగిన తలారి బాలయ్య ప్రయాణం కేవలం వ్యక్తిగత విజయం మాత్రమే కాదుపట్టుదలతో చదివికష్టపడి ఉన్నత స్థానాలకు చేరుకోవాలనుకునే గ్రామీణ యువతకు స్ఫూర్తినిచ్చే విజయగాథ.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

-మెట్పల్లిలో నూతనంగా మంజూరైన 3737 సామాజిక భద్రతా పింఛన్ల ప్రొసీడింగ్ పత్రాలు పంపిణీ

-హాజరైన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

జగిత్యాల, నవంబర్ 20 (తెలంగాణ పత్రిక)

జగిత్యాల జిల్లా మెట్పల్లి ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో మెట్పల్లి పట్టణంలో శుక్రవారం నిర్వహించిన నూతన సామాజిక భద్రతా పింఛన్ల మంజూరు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ వెలమ సంఘ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు పాల్గొని నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షే



మానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో కొత్తగా పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలు దివ్యాంగులు కల్లుగీత కార్మికులు చేనేత కార్మికులు ఫైలేరియా బాధితులకు పింఛన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత అందుతోందని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులం



దరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక భద్రత పింఛన్లు వృద్ధులు దివ్యాంగులు ఒంటరి మహిళలు నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ప్రతి నెలా అందే పింఛన్ వారి జీవనానికి ఆర్థిక భరోసా కల్పిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలు నిబంధనల ప్రకారం నూతన సామాజిక భద్రతా పింఛన్ల కోసం అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారిని గుర్తించి పింఛన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జివాకర్ రెడ్డి డీఆర్డీఓ రఘువరన్ ఎంపీడీఓ తహసీల్దార్ స్థానిక ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143

మంత్రివర్గ విస్తరణలో బీసీలకు సగం వాటా ఇవ్వాల్సిందే

-డిప్యూటీ సీఎం పదవికి బీసీలు అర్హులు కాదా..?
-కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయకపోతే కాంగ్రెస్ పై బీసీల తిరుగుబాటు తప్పదు
-బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి

కామారెడ్డి, నవంబర్ 20 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలకు అనేక హామీలు ఇచ్చిందని, హామీలు ఇచ్చి మూడు సంవత్సరాలు పూర్తి అవుతున్న ఇంతవరకు హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం చెందిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు నేడు కామారెడ్డి పట్టణంలో ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ పాల్గొని మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆర్థిక సంవత్సరం బీసీల సంక్షేమానికి 20వేల కోట్లు కేటాయించి ఐదు సంవత్సరాల గాను లక్ష కోట్లు కేటాయిస్తామని, బీసీ సబ్ ప్లాన్ కు చట్టబద్ధత కల్పిస్తామని, ప్రభుత్వ కాంట్రాక్టర్లలో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని,ప్రభుత్వ పదవులు,



నామినేటెడ్ మరియు మంత్రివర్గంలో బీసీలకు జనాభా దామాషా ప్రకారం అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేటి వరకు బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉన్నందున రాష్ట్ర మంత్రివర్గంలో డిప్యూటీ సీఎంతో సహా 8 మంది బీసీలకు మంత్రులుగా అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు అలాగే నామినేటెడ్ పోస్టులు, ఐఏఎస్,ఐపీఎస్, యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్, పోస్టులలో బీసీలకు తెలంగాణలో జరిగిన బీసీ కులగనన లెక్కల ప్రకారం 60 శాతం వాటా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు నెల రోజుల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సంపూర్ణంగా అమలు చేయకపోతే లక్ష మందితో కామారెడ్డిలో బీసీ గర్జన నిర్వహించి కాంగ్రెస్ పై తిరుగుబాటు జెండా ఎగిరేస్తామని ఆయన హెచ్చరించారు జాతీయ జనగణలో బీసీ కులగనన చేపట్టాలని, ప్రతి కులానికి ఒక యూనిక్ కోడ్ కేటాయించి బీసీ కులాల లెక్కలు తీయాలని ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచడానికి డిసెంబర్ 14న ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో బీసీల జనభేరి సభను నిర్వహిస్తున్నామని ఈ సభకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుండి వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్,సాప శివరాములు,బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు, బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మనిమంజరి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సంధ్యారాణి, మహిళా అధ్యక్షురాలు బాజ లలిత, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట స్వామి,కొత్తపల్లి మల్లన్న,రాజయ్య, మొహనా చారి,యాదగిరి,ఎల్లయ్య,నర్సింలు,సంజీవ్,వెంకట్,రాజ నర్సింలు,విగ్నేష్,ప్రతాప్, శివమణి, బాలరాజు, శ్రీనివాస్,నితిన్. తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లే సమయంలో జాగ్రత్త పాటించాలి
-సదాశివ నగర్ ఎస్సై పుష్పరాజ్

కామారెడ్డి, నవంబర్ 20 ,(తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల ప్రజలకు సదాశివ నగర్ ఎస్సై పుష్పరాజ్ పలు సూచనలు చేశారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లేటప్పుడు తలుపులు కిటికీలు సరిగ్గా మూసారు లేదో చూసుకోవాలి ఇంట్లో అధిక మొత్తంలో నగదు బంగారు ఆభరణాలు ఉంచుకోకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలి. కుటుంబ సభ్యులు అందరూ ఊరికి వెళ్లేటప్పుడు పోలీసులకు లేదా నమ్మకమైన పొరుగు వారికి సమాచారం ఇవ్వాలి. ఇంటి పరిసరాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి రాత్రి సమయంలో ఇంటిబయట లైట్లు వెలిగేలా చూసుకోవాలి. ప్రజల భద్రత కోసం పోలీసులు రాత్రి గస్తిని పటిష్టం చేస్తున్నారని. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు. ద్విచక్ర వాహనాలు నిర్మానుష ప్రదేశాల్లో పార్కింగ్ చేయకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉంచి తప్పనిసరిగా లాక్ చేసుకోవాలని పేర్కొన్నారు. గ్రామంలో అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్టు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు అపరిచిత వ్యక్తులకు ఇంటి వివరాలు కుటుంబ సభ్యుల సమాచారం వెల్లడించకూడదు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్తున్న విషయాన్ని సోషల్ మీడియాలో ప్రచారం



చేయవద్దని సూచించారు. మహిళలు ఒంటరిగా ప్రయాణించే సమయంలో బంగారు ఆభరణాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి బ్యాంకు నుంచి పెద్ద మొత్తంలో నగదు తీసుకువెళ్లేటప్పుడు తగినజాగ్రత్తలు పాటించాలని తెలిపారు. గ్రామాలల్లో రాత్రివేళలో అనుమానస్పద వ్యక్తులు లేదా కనిపించినట్టయితే వెంటనే డయల్ 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని సదాశివనగర్ ఎస్సై పుష్పరాజ్ సూచించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతకు నాంది

-మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి

జగిత్యాల నవంబర్ 20 (తెలంగాణ పత్రిక):

జగిత్యాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి 54 వ బాల వైజ్ఞానిక ప్రదర్శన (2026-27), 13వ ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ (2025-26), జిల్లా స్థాయి పీఎం శ్రీ సైన్స్ ఎగ్జిబిషన్ 2026 కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి గ్రంథాలయ చైర్మన్ సంగనబట్ల దినేష్ జిల్లా విద్యా ధికారి రాము హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సి పల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు సృజనాత్మకత నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని అన్నారు. విద్యార్థులు తమ ఆలోచనలను ప్రాజెక్టుల రూపంలో ఆవిష్కరించి వాటి ఉపయోగాలను వివరించడం అభినందనీయ మని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల పరిశోధనా దృక్పథం సమస్యలను పరిష్కరించే నైపుణ్యం ఆత్మవిశ్వాసం



పెరుగుతాయని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఇవి పునాదిగా నిలుస్తాయని అన్నారు. నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు ఆవిష్క ర్తలు కాబట్టి విజ్ఞానాన్ని ఆచరణలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఎంతో అవసరమని తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం రీసైక్లింగ్ కంపోస్ట్ తయారీ వంటి అంశా లను పాఠశాల స్థాయి నుంచే అలవర్చుకోవాలని సూచించారు. తరగతి గదుల నుంచే చెత్తను సక్రమ ంగా వేరు చేసే అలవాటును ప్రారంభించడం ద్వారా పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యతాయు తమైన భావన పెంపొందుతుందని అన్నారు.



విద్యార్థులు ఇలాంటి అంశాలపై ప్రదర్శనలు రూపొం దింప చేయుటకు అవగాహన కల్పించాలని పేర్కొ న్నారు. వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుతున్న విద్యార్థులందరినీ వారికి మార్గదర్శకత్వం అందిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ప్రద ర్శనల్లో విజయం సాధించిన విద్యార్థులకు శుభాకా ంక్షలు తెలియజేస్తూ ప్రతి విద్యార్థి కొత్త ఆలోచనలతో ముందుకు సాగి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దయా ల చంద్రకళశంకర్ అరవలక్ష్మి మండల విద్యాధికా రులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా.. అల్పాహార నాణ్యతలో రాజీ పడొద్దు



(తెలంగాణ పత్రిక)20/11/26

ఎంపీ డాక్టర్ మల్లు రవి నేడు హైదరాబాద్‌లో తెలంగాణ ప్రజా ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం, విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) అందించే కార్యక్రమ బాధ్యతలను హరే కృష్ణ హరే రామ సంస్థకు అప్పగించిన నేపథ్యంలో, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి ఆ సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందించే అల్పాహార తయారీ విధానం, ఆహార



నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించి, ప్రతి విద్యార్థికి నాణ్యమైన, రుచికరమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించాలని సంస్థ ప్రతినిధులకు సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రజా ప్రభుత్వానికి ఉన్న బాధ్యతకు అనుగుణంగా, అల్పాహార పంపిణీలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నాణ్యత ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు పోషకాహారం అందించి, వారు ఆరోగ్యంగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం సక్రమంగా అమలు కావాలని ఎంపీ డాక్టర్ మల్లు రవి ఆకాంక్షించారు.

జూకల్‌లో ఏనుగు వేణు రెడ్డి విగ్రహావిష్కరణ

-పూలమాలవేసి నివాళులర్పించిన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



రాజేంద్రనగర్ ప్రతినిధి నవంబర్ 20 తెలంగాణ పత్రిక .

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని జూకల్ గ్రామంలో శుక్రవారం నాడు ఏనుగు వేణు రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగిం ది. కార్యక్రమానికి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఏనుగు వేణు రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... ఏనుగు వేణు రెడ్డి గ్రామ అభివృద్ధికి, ప్రజా సేవకు చేసిన కృషిని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, యువత ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏనుగు వేణు రెడ్డి కుటుంబ సభ్యులు , గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంలో గ్రంథాలయాలు కీలకం

జగిత్యాల, నవంబర్ 20 (తెలంగాణ పత్రిక):



జగిత్యాల జిల్లా గ్రంథాలయ వారో త్సవాల ముగింపు వేడుకల్లో జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనబట్ల దినేష్, మున్సిపల్ చైర్‌ప ర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పాటలు తదితర పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానం సెల్‌ఫోన్ల వినియోగంపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని అదే సమయంలో పుస్తక పఠనానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పాఠశాల పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న మహనీయుల జీవిత చరిత్రలు విజ్ఞానదాయకమైన పుస్తకాలను చదివి వారి అనుభవాలు ఆశయాలు స్ఫూర్తిని తెలుసుకోవాలని పేర్కొన్నారు. పుస్తక పఠనం విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ఆలోచనా శక్తికి సృజనాత్మకతకు దోహదపడుతుందని అన్నారు. విద్యార్థులు గ్రంథాల యాలను సద్వినియోగం చేసుకుంటూ చదివే అలవాటును పెంపొందిం చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము అధ్యక్ష కార్యదర్శులు అమరనాథ్ రెడ్డి ఆనంద్ రావు గ్రంథాలయ అధికారులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడి, వ్యక్తి మృతికి కారణమైన ఇద్దరు నిందితుల అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు.

భద్రాద్రి కొత్తగూడెం తెలంగాణ పత్రిక నవంబర్ 20



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భద్రాచలం పట్టణంలో లాడ్జిలో గది కావాలని అడిగిన వ్యక్తులపై దాడికి పాల్పడి, తెల్లం శరత్ బాబు మృతికి కారణమైన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలిం చారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. 16.11.2026వ తేదీన మృతుడు తెల్లం శరత్ బాబు వద్దకు అతని స్నేహితులు మరియు బంధువులైన కుర్సం నాగప్రశాంత్, కీసర కార్తీక్‌లు కలిసేందుకు భద్రాచలం వచ్చారు. వారు రాత్రి బస చేసేందుకు గది కోసం వెతుకుతూ, అదే రోజు రాత్రి సుమారు 10:00 గంటల సమయంలో భద్రాచలం రామాలయం సమీపంలోని సత్యసాయి లాడ్జికి వెళ్లి గది కావాలని అడిగారు. ఈ క్రమంలో లాడ్జి యజమాని ద్వార మణికంఠ మరియు లాడ్జి బాయ్ బర్ల వినయ్‌లు గది కేటాయింపు విషయంలో సదరు ముగ్గురు వ్యక్తులతో వాగ్వాదానికి దిగి, వారిపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో తెల్లం శరత్ బాబు తీవ్రంగా గాయపడి, రోడ్డుపై స్పృహ కోల్పోయి పడిపోయాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి తెల్లం రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితులైన ద్వార మణికంఠ బర్ల వినయ్‌లను 20.11.2026వ తేదీన భద్రాచలం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రాచలం పట్టణ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటాము.

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA
TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
నిజం మా బిజినెస్

మల్లారెడ్డిపేట వీరాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి భారీ విరాళం

-రెండు లక్షల చెక్కును అందజేసిన లింగన్నపేట దేశాయ్ గారి మనవలు



గంభీరావుపేట తెలంగాణ పత్రిక నవంబర్ 20

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామంలోని వీరాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కోసం లింగన్నపేట దేశాయ్ గారి మనుమలు రెండు లక్షల రూపాయల చెక్కును శుక్రవారం రోజున హైదరాబాద్ లోనీ వారి నివాసంలో అందించారు ఆలయ అభివృద్ధి కోసం అడగగానే డబ్బులు అందించిన వారి కుటుంబ సభ్యులందరికి మల్లారెడ్డిపేట గ్రామ పాలక వర్గం దేవాలయ కమిటీ గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పాపన్నపేట హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ

-తహసిల్దార్ సతీష్ కుమార్



పాపన్నపేట,నవంబర్ 20:(తెలంగాణ పత్రిక)

మెదక్ జిల్లా, మండల కేంద్రమైన పాపన్నపేట ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు శుక్రవారం రోజు దుప్పట్లు పంపిణీ చేసినట్లు పాపన్నపేట తహసిల్దార్ సతీష్ కుమార్,వార్డెన్ మహేష్ లు తెలిపారు.అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల నుండి విద్య కోసం వచ్చిన విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తుందని ఆయన అభిప్రాయ పడ్డారు.విద్యార్థులందరూ చక్కగా చదువుకొని తమ తమ తలిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు లింగంపేట నరేందర్ గౌడ్,పాపన్నపేట జిపిఓ కిష్టయ్య,తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై అధికారుల మౌనం ఎందుకు

రాజేంద్రనగర్ ప్రతినిధి నవంబర్ 20 తెలంగాణ పత్రిక.



నిబంధనలకు విరుద్ధంగా శంషాబాద్ పట్టణంలో సెల్లార్లు త్రవ్వుతూ బహులా అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్న అధికారుల మౌనం తీరు పట్ల శంషాబాద్ పట్టణ ప్రజలు తీవ్రంగా మండిఎడుతున్నారు. త111 జిఓ లో బహుళ అంతస్తులకు పర్మిషన్లు లేకున్నా సెల్లార్ త్రవ్వకాలకు పర్మిషన్లు లేకున్నా ఎలా ఈ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ప్రజలు ప్రశ్నిస్తు న్నారు. నోటీసులు ఇచ్చి చేతులు దులుపు కోవడమేనా లేదా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటారా లేదా అని స్థానిక ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. వెంటనే అక్రమ నిర్మాణాలను అడ్డుకొని తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గూడూరు గ్రామ సమగ్రాభివృద్ధిపై ముఖ్యమంత్రి వినతి

-సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



పాలకుర్తి నవంబర్ 20(తెలంగాణ పత్రిక):

జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరు గ్రామ సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని గ్రామ పంచాయతీ పాలకవర్గం తరఫున ముఖ్యమంత్రికి సమర్పించిన వినతి పత్రానికి సానుకూల స్పందన లభించింది. డాక్టర్ చుక్కారామయ్య 100వ జన్మదిన వేడుకలు సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రికి గ్రామ సమగ్ర అభివృద్ధికి వినతిపత్రం అందించడం జరిగింది. దానికి సానుకూలంగా స్పందించి గ్రామ అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రికి గూడూరు గ్రామ ప్రజల పక్షాన కృతజ్ఞతాభివందనాలు తెలియజేసిన మాచర్ల స్వరూప పుల్లయ్య సర్పంచ్ , గుగ్గిళ్ళ కళ్యాణ్ ఉపసర్పంచ్ పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు.

డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలి







-8 ఏళ్లుగా పోరాటం.. 354 రోజులుగా సామూహిక నిరాహార దీక్షలు

తెలంగాణ పత్రిక కల్వకుర్తి, నవంబర్ 20:

నాగర్ కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో ఎర్రవల్లి గ్రామ ప్రజలు ఎర్రవల్లి గ్రామం నుండి కల్వకుర్తి ఆర్డీవో ఆఫీస్ వరకు శుక్రవారం రోజున దాదాపు 25 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు.డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించ తలపెట్టిన ఎర్రవల్లి--గోకారం రిజర్వాయర్‌తో ఎర్రవల్లి, ఎర్రవల్లి తండా గ్రామాలు, వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాలను, భూములను కాపాడాలని కోరుతూ శుక్రవారం కల్వకుర్తి ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు.గత ఎనిమిదేళ్లుగా ఈ సమస్యపై పోరాటం చేస్తున్నామని, దీనిలో భాగంగా స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికలను సైతం బహిష్కరించామని గ్రామస్తులు వినతిపత్రంలో పేర్కొన్నారు. గత 11 నెలలుగా శాంతియుతంగా సామూహిక నిరాహార దీక్షలు చేపడుతున్నామని, తమ పోరాటం నేటికి 354 రోజులకు చేరుకుందని తెలిపారు. చిన్న, సన్నకారు రైతులమైన తాము పూర్తిగా వ్యవసాయ భూములపైనే ఆధారపడి జీవిస్తున్నామని, రిజర్వాయర్ నిర్మాణంతో భూములు కోల్పోతే నిరాశ్రయులమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్య పరిష్కారానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి ఎర్రవల్లి నిర్వాసితులకు స్వచ్ఛమైన హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఇటీవల వెల్దండ తాసిల్దార్ ఎర్రవల్లి గ్రామపంచాయతీకి ఆర్‌డఆర్ ప్యాకేజీ అమలు చేస్తామని చెప్పడంతో నిర్వాసితుల్లో మరింత ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. పాలమూరు ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేసి, బస్వాపూర్, పుట్టంగండి, ఎస్ఎల్‌బీసీ వంటి ప్రాజెక్టుల ద్వారా నీటిని తరలించి పాలమూరు జిల్లా నీటి హక్కులు, భూములను కాపాడాలని కోరారు.ప్రభుత్వం తమ సమస్యను దృష్టిలో ఉంచుకొని గత 11 నెలలుగా శాంతియుతంగా పోరాటం చేస్తున్న ఎర్రవల్లి నిర్వాసితులకు న్యాయం చేయాలని, ఆర్‌అండ్‌ఆర్ ప్రాథమిక నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని, తమ గ్రామాలను, భూములను ముంపు నుంచి కాపాడాలని వినతిఎ త్రంలో విజ్ఞప్తి చేస్తూ1. డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేసి ఎద్దరపల్లి, ఎద్దరపల్లి తండా గ్రామాలను ముంపు నుంచి కాపాడాలి.2. పాత గోకారం చెరువును యథావిధిగా పునర్నిర్మించాలి.3. ఆర్‌అండ ఆర్ ప్రాథమిక నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ఎర్రవల్లి, ఎర్రవల్లి తండా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ జన్మదిన వేడుక





(తెలంగాణ పత్రిక)20/11/26జోగులాంబగద్వాల్ జిల్లా ప్రతినిధి

సందర్భంగా ఈరోజు ఐజ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయం నందు ఘనంగా జన్మదిన వేడుకలు జరపడం జరిగింది ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచే నాయకుడు, ఎప్పుడు పిలిచినా పలికే మా ప్రియతమ నాయకుడు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్ జన్మదిన సందర్భంగా ఐజ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది భవిష్యత్తులో ఆయన రాజకీయంగా మరింత ముందుకు ఎదగాలని పార్టీకి కార్యకర్తలకు అలంపూర్ నియోజకవర్గ ప్రజలకు అండగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు ఈ కార్యక్రమంలో పట్టణ మరియు మండల కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, సర్పంచులు మాజీ సర్పంచులు ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

ఇల్లంతకుంటలో రాజ్యాంగ దినోత్సవ కరపత్రం ఆవిష్కరణ

-26న ఘనంగా వేడుకలు రాకేష్

ఇల్లంతకుంట, నవంబర్ 20 తెలంగాణ పత్రిక

మండల అభివృద్ధి ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 26న ఇల్లంతకుంటలో నిర్వహించనున్న భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం ఇల్లంతకుంట బస్టాండ్ ఆవరణలో ఆవిష్కరించారు. ఐక్య వేదిక అధ్యక్షుడు సావనపెల్లి రాకేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కరపత్రం ఆవిష్కరణ అనంతరం వారు మాట్లాడుతూ 1949 నవంబర్ 26న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం ఆమోదించబడిందని అన్నారు. రాజ్యాంగం మనకు కేవలం ఓటు హక్కు మాత్రమే కాదని, బతికే హక్కు, చదువుకునే హక్కు, సమానంగా గౌరవంగా బతికే హక్కును ప్రసాదించిందని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు కలిసి రాజ్యాంగం గురించి తెలుసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ వేడుక ఏ పార్టీది కాదు, ఏ కులానిది కాదు, ఇది మనందరి రాజ్యాంగ వేడుక అని స్పష్టం చేశారు. ఈ నెల 26న ఇల్లంతకుంటలో జరిగే వేడుకల్లో బహుజన కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.ముఖ్య అతిథులుగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్, ఆరెపల్లి మోహన్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్, జిల్లా అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. వేడుకలకు మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, మేధావులు, అన్ని కుల సంఘాల అధ్యక్షులు, యువకులు, విద్యార్థులు, మహిళలు రాజకీయాలకు అతీతంగా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు బడుగు లింగయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి తీపిరెడ్డి తిరుపతిరెడ్డి, బీఎస్పీ జిల్లా కార్యదర్శి ఏనుగుల లింగన్న, బీజేపీ రాష్ట్ర నాయకుడు మ్యాకల మల్లేశం, ఎంఎస్పీ రాజన్న సిరిసిల్ల జిల్లా కన్వీనర్ ఖానాపురం లక్ష్మణ్ మాదిగ, ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకుడు గుండ్రేడ్డి రాజు మాదిగ, నాయకులు సుదగోని నారాయణ గౌడ్, శ్రీనివాస్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏడుపాయల్లో అంగరంగ వైభవంగా కార్తీక ఆకాశ దీపోత్సవం



పాపన్నపేట,నవంబర్ 20:(తెలంగాణ పత్రిక)

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఏడుపాయల వనదుర్గామాత ఆలయం కార్తీక మాసం సందర్భంగా నిత్యం దీప కాంతులతో విరాజిల్లుతోంది.కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం రోజు రాత్రి ఆలయ ప్రాంగణంలో ఆకాశ దీపోత్సవ వేడుకలను ఆలయ పూజారులు పార్థివ శర్మ, శంకర్ శర్మలు అత్యంత సుందరంగా ముస్తాబు చేసారు. మంజీరా నదీ తీరాన వెలిసిన అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన ఈదీపోత్సవ వేడుకలకు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా ప్రమిదల వెలుగులతో దేదీప్యమానంగా మెరిసిపోయింది.మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో మట్టి ప్రమిదలను వెలిగించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తులు దుర్గా నామ స్మరణతో""జై దుర్గా మాతకు జై"అంటూ ఉస్తావంలో పాల్గొన్నారు. దుర్గా నామస్మరణతో ఏడుపాయల ప్రాంతమంతా మార్మోగింది. ఆలయ గోపురం వద్ద ప్రత్యేక ధ్వజస్తంభానికి అర్చకులు ఆకాశ దీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించి పైకి ఎగురవేశారు. లోకకల్యాణం,ప్రజల సుఖశాంతుల కోసం ఈ దీపాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆకాశంలో ఎగసిన ఈదీప కాంతులను చూసి భక్తులు భక్తిభావంతో పరవశించి పోయారు.ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి,సిబ్బంది సూర్య శ్రీనివాస్,ప్రతాప్ రెడ్డి,పల్లె సాయిబాబా, మధుసూదన్ రెడ్డి, ఆలయ అర్చకులు, ఆయా ప్రాంతాల్లో నుండి వచ్చిన భక్తులు తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ దినోత్సవ సదస్సును జయప్రదం చేయండి

- డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ

ఖమ్మం జిల్లా ప్రతినిధి నవంబర్ 20 (తెలంగాణ పత్రిక)

ఈనెల 26న జరిగే భారత రాజ్యాంగ దినోత్సవ సభను జయప్రదం చేయాలని తెలంగాణ మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కోరిపల్లి శ్రీనివాస్ మాదిగ పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం రూపుదిద్దుకోవడానికి కారణం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగమేనని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన పూర్తిస్థాయిలో రాజ్యాంగం అమలు కావడం లేదని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడుపై ఉందని ఆయన తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ,1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని, భారత రాజ్యాంగాన్ని పటిష్టంగా అమలుపరిచేందుకు, రాజ్యాంగ హక్కులు కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను, ప్రతి ఒక్కరు స్మరించాలని అన్నారు రాజ్యాంగాన్ని విమర్శించే వాళ్ళని దేశద్రోహులుగా చూడాలన్నారు. తెలంగాణ మాదిగ హక్కుల దండోరా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలో ఐఎంఏ హాల్లో జరిగే,భారత రాజ్యాంగ దినోత్సవ సదస్సున ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆర్టిఐ కమిషనర్ పీవీ శ్రీనివాస్, సంఘం వ్యవస్థాపకులు జన్ను కనకరాజు మాదిగ, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని అన్నారు. మేధావులు, ఉద్యోగస్తులు, విద్యార్థులు, యువత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు దుప్పెల్లి శ్రీను మాదిగ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మునగలేటి వీరస్వామి మాదిగ, ఖమ్మం నియోజకవర్గం ఇంచార్జి పిల్లిగుండ్ల ముత్తయ్య మాదిగ, పాలేరు నియోజకవర్గ ఇంచార్జి బొడ్డు గురువయ్య మాదిగ, ఖమ్మం కార్పొరేషన్ ఇంచార్జి రాయల నాగేశ్వరరావు, పాలేరు నియోజకవర్గ కో-ఇంచార్జి కొండా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



బాస్కెట్ బాల్ క్రీడా పరిశీలకురాలు గా పి డి. మల్లీశ్వరి

తెలంగాణ పత్రిక నవంబర్ 20 జగిత్యాల జిల్లా ప్రతినిధి



ఖమ్మం లో ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించుచున్న రాష్ట్రస్థాయి పాఠశాలల 14 సంవత్సరాల బాల బాలికల బాస్కెట్బాల్ పోటీలకు జడ్పి హై చ్ఎస్ లక్ష్మీపూర్ పాఠశాలలో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయు రాలు మల్లేశ్వరి క్రీడా పరిశీలకులుగా నియమించబడ్డారు నియామకం పట్ల ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ చక్రధర్ రావు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు అశోక్ కార్యదర్శులు నవీన్ మరియు వ్యాయామ ఉపాధ్యాయులు లక్ష్మీ రామ్ నాయక్, రవీందర్, కృష్ణ ప్రసాద్ భాస్కర్, విజయ స్వప్న, మంజులదరని అభినందించారు

ముమ్మరంగా సాగుతున్న ' వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్ ' ఏర్పాట్లు

హైదరాబాద్, నవంబర్ 20 (జూబ్లీహిల్స్, తెలంగాణ పత్రిక) :

జూబ్లీ హిల్స్ నియోజకవర్గం పరిధిలోని నందా నగర్, ఎర్రగడ్డలో జరగనున్న ' నషా ముక్త్ భారత్ ' పాదయాత్ర ఏర్పాట్లలో భాగంగా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, లంకల దీపక్ రెడ్డి నాయకత్వం, మార్గదర్శకత్వంలో జరిగింది. ఎర్రగడ్డలో జరిగిన ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షులు విజయ్ కుమార్, ఎర్రగడ్డ డివిజన్ ఇంచార్జ్, హైదరాబాద్ సెంట్రల్ మైనారిటీ మోర్చా అధ్యక్షులు జబ్బర్, ముఖ్య అతిథిగా విచ్చేసి, కార్యక్రమ ఏర్పాట్లు, పాదయాత్ర విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, రాబోయే పాదయాత్రలో చురుకైన భాగస్వామ్యాన్ని కల్పించడం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి మాదకద్రవ్యాల రహిత భారత్‌ను నిర్మించడం అనే అంశాలపై దృష్టి సారించడంతో పాటు ఆరోగ్యకరమైన మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం ఏకమవుదానే నినాదం స్ఫూర్తితో పలువురు నాయకులు, గణేష్ కుమార్, నాగేశ్వరరావు, సునీత, జ్యోతి, శివ, శ్రీధర్ రెడ్డి, క్రాంతి, మోయిన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఘనంగా ప్రారంభమైన ఇందిరమ్మ బీమా పథకం

-ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రారంభించిన ఎంపీడీఓ ముత్యాలరావు



తెలంగాణ పత్రిక నవంబర్ 20 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ బీమా పథకాన్ని అశ్వాపురం మండల పరిధిలో స్థానిక ఎంపీడీఓ ముత్యాల రావు ఆధ్వర్యంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా మండల పరిధిలోని ఎలుకలగూడెం, సీతారామపురం గ్రామాల్లో బీమా ఆన్‌లైన్ విధానాన్ని ఎంపీడీఓ ముత్యాలరావు స్వయంగా పర్యవేక్షించారు. గ్రామాల్లో పర్యటించి బీమా నమోదు ప్రక్రియను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు.పేద కుటుంబాలకు అండగా నిలిచేందుకే ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకంలో నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ పిలుపునిచ్చారు. ఎవరూ మిగిలిపోకుండా గ్రామాల వారీగా పూర్తి స్థాయిలో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మండల అధికారులు, గ్రామ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు మంత్రి తుమ్మల చర్యలు

-మంత్రి చేపట్టిన చర్యలు భేష్ అంటున్న ప్రజలు

తెలంగాణ పత్రిక , అశ్వాపురం నవంబర్ 20 :

ప్రకృతి వైపరీత్యాల వలన వాతావరణ మార్పుల ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే తాగునీటి సమస్య లను ముందుగానే అంచనా వేసి చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇవ్వడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి నీటి కొరత తలెత్తే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముందస్తు ప్రణాళికతో దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలతో ఎత్తును పెంచేలా వ్యవహరించడం జిల్లా ప్రజల్లో చర్చనీయాంశంగా మారిందనే చెప్పవచ్చు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండలం లోని అమ్మగారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి జలాలను నిల్వ చేసేందుకు చేపట్టిన చర్యలు ఆశించిన ఫలితాలను అందిస్తున్నాయి. ఆనకట్టపై ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవ చూపడం వల్ల గోదావరిలో నీటి మట్టం పెరిగి నిల్వలు మెరుగుపడ్డాయి. దీంతో పరిసర ప్రాంతాలకు తాగునీటి సరఫరా విషయంలో కొంతకాలం వరకు భరోసా ఏర్పడిందని ఘంటా పదంగా చెప్పవచ్చని ప్రజలు అంటున్నారు. సాధారణంగా వేసవికాలం సమీపిస్తే గోదావరి పరివాహక ప్రాంతాల్లో సైతం నీటి లభ్యతపై ఆందోళనలు వ్యక్తమవుతుంటాయి. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితులు నెలకొంటే గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ పరిస్థితులను ముందుగానే గుర్తించిన మంత్రి తుమ్మల అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు గోదావరి జలాలను వీలైనంత ఎక్కువగా నిల్వ చేసుకునే దిశగా చర్యలు చేపట్టడం ఇప్పుడు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.





ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తుల నమోదు



తెలంగాణ పత్రిక నవంబర్ 20 యాదాద్రి భువనగిరి:

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తుల నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీ లోని న్యూ గుండ్లపల్లిలో 7,8 వార్డు, భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 8, 10వ వార్డులలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భ ంగా దరఖాస్తుల నమోదు విధానం, లబ్ధిదారుల వివరాల సేకరణ, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ, గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నంబర్ తో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.



ప్రతి ఒక్కరూ తమ ఫారంలో పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని, అనంతరం నమోదు చేసిన వివరాలను మరోసారి సరిచూసు కోవాలని తెలిపారు. కుటుంబ పెద్ద ఏమైనా కారణ ంతో చనిపోతే వారి కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందుతుందని, కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. నమోదు ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచిం చారు. దరఖాస్తు చేసుకునే కుటుంబ సభ్యులను స్వయంగా అడిగి వారి వివరాలను నిర్ధారించుకున్న తర్వాతే దరఖాస్తులను నమోదు చేయాలని తెలిపారు. దరఖాస్తుల్లో పేర్లు, కుటుంబ సభ్యుల వివరాలు తదితర సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి తప్పులు, పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో పేద కుటుంబాలకు భరోసా.. 22వ వార్డులో వైట్ రేషన్ కార్డుదారులకు బీమా నమోదు

-కౌన్సిలర్లు ఇప్పపూల మమత, అజయ్ ఆధ్వర్యంలో కార్యక్రమం



తెలంగాణ పత్రిక వేములవాడ

వేములవాడ,నేడు న్యూస్ :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా కార్యక్రమంలో భాగంగా వేములవాడ పట్టణంలోని 22వ వార్డులో వైట్ రేషన్ కార్డుదారులకు జీవిత బీమా నమోదు ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్లు ఇప్పపూల మమత, అజయ్ పాల్గొని అర్హులైన కుటుంబాలకు బీమా కల్పించే ప్రక్రియను పర్యవేక్షించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు ఆపద సమయంలో కుటుంబాలకు అండగా నిలవడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.